నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY



సంపుటి : 13 సంచిక : 181 రంగారెడ్డి | ఆదివారం 01 నవంబర్ 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | 01-11-2026 November | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To: Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy-Siddipet-Medchal-Jagityal-Vemulawada

ప్రభుత్వ రంగ బ్యాంకులు జాతీయ ఆస్తులు

ఐడీబీఐ ప్రైవేటీకరణ నిలిపివేయాలి



- కేంద్రం తీరుపై కేటీఆర్ ప్రశ్నల వర్షం
- సిబ్బంది ఆందోళనలను ఎందుకు పట్టించుకోవడం లేదు
- ఉద్యోగుల ఆందోళనకు బీఆర్ఎస్ మద్దతు

నిర్భయవార్త ప్రతినిధి : ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ రంగ బ్యాంకులు పరిరక్షించాల్సిన జాతీయ ఆస్తులని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణను నిలిపివేయాలంటూ ఉద్యోగులు చేస్తున్న ఆందోళనలను కేంద్ర ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణను నిలిపివేయాలన్న తమ విజ్ఞప్తికి, ఆందోళనకు మద్దతు తెలపాలని కోరుతూ ఆల్ ఇండియా ఐడీబీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేసింది. ఈ ట్వీట్‌లో కేటీఆర్‌ను ట్యాగ్ చేయగా ఆయన స్పందించారు. ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు దేశానికి చెందిన కీలకమైన జాతీయ ఆస్తులని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణ నిర్ణయంపై ఉద్యోగులు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను కేంద్రం పరిగణనలోకి తీసుకోవాలని కేటీఆర్ తన స్పందన ద్వారా డిమాండ్ చేశారు

ఇస్రో శాస్త్రవేత్తలకు సీఎం రేవంత్ అభినందనలు..



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) నావిగేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఉపగ్రహాన్ని నిర్దేశిత భూస్థిర కక్ష్యలోకి ప్రవేశపెట్టడం, భారత నావిగేషన్ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే కీలక మైలురాయి అని ప్రశంసించారు. రవాణా, విమానయానం, సముద్ర నావిగేషన్, పర్యవేక్షణ, అత్యవసర సేవల వంటి కీలక రంగాల్లో NVS03 మెరుగైన సేవలు అందించనుందని పేర్కొన్నారు. ఈ విజయం యావత్ దేశానికి గర్వకారణమని, భవిష్యత్తులో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని ముఖ్యమంత్రి గారు ఆకాంక్షించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలి... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్.

(మిగతా 3లో..)

పటేల్‌కు దక్కాల్సిన గౌరవాన్ని కాంగ్రెస్ దూరం చేసింది

ప్రజల జ్ఞాపకాల నుంచి ఆయనను చెరిపే సేందుకు ప్రయత్నించింది

దేశ సమైక్యతకు పటేల్ విశేష కృషి

అవిభాజ్య భారత నిర్మాణానికి పునాది వేశారన్న అమిత్ షా

తక్కువ సమయంలోనే ఎన్నో కీలక పనులు పూర్తి చేశారని వ్యాఖ్య

2029 నాటికి డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యం



నిర్భయవార్త ప్రతినిధి : సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌కు దక్కాల్సిన గౌరవం కాంగ్రెస్ పాలనలో లభించలేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. ఆయనను పక్కనపెట్టి, ప్రజల జ్ఞాపకాల నుంచి చెరిపేసేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రయత్నించిందని విమర్శించారు. పటేల్ 151వ జయంతి సందర్భంగా శనివారం ఢిల్లీలో నిర్వహించిన 'ఏక్తా రన్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సర్దార్ పటేల్ స్మారకంగా ప్రపంచంలోనే ఎత్తైన విగ్రహమైన 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ'ని నిర్మించారని అమిత్ షా గుర్తుచేశారు. ఈ విగ్రహం ద్వారా పటేల్ సేవలు, ఆయన వ్యక్తిత్వాన్ని దేశవ్యాప్తంగా ప్రజలకు పరిచయం చేసినట్లు పేర్కొన్నారు. దేశ సమైక్యత కోసం పటేల్ చేసిన కృషిని అమిత్ షా ప్రస్తావించారు. కేవలం 1,218 రోజుల్లోనే అవిభాజ్య భారతదేశ నిర్మాణానికి ఆయన పునాది వేశారని చెప్పారు. పలువురు నాయకులు కలిసి తమ జీవితకాలంలో సాధించలేని పనులను పటేల్ తక్కువ సమయంలోనే పూర్తి చేశారని వ్యాఖ్యానించారు. దేశాన్ని ఏకతాటి పైకి తీసుకురావడంలో ఆయన పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. దేశాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు ప్రజలంతా సహకరించాలని అమిత్ షా పిలుపునిచ్చారు. 2029 డిసెంబర్ 31 నాటికి భారత్‌ను పూర్తిగా డ్రగ్స్ రహిత దేశంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. 'నషా ముక్త్ భారత్' సాధనతోనే 'వికసిత్ భారత్' లక్ష్యం దిశగా ముందడుగు వేయగలమని అన్నారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి నక్సలిజం నిర్మూలన దిశగా దేశం పురోగతి సాధించిందని పేర్కొన్నారు.

అమ్మలేని లోటు ఉండొద్దని నాతో పాటే తీసుకువెళ్లా..!



నిర్భయవార్త ప్రతినిధి : మహారాష్ట్రలోని పూణెలో హృదయ విదారక సంఘటన చోటుచేసుకుంది. కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన తల్లే.. తన కన్నపేగును తీసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పింప్రి-చించ్‌వాడ్ ప్రాంతంలో జరిగిన ఈ దారుణ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. థెర్‌గావ్-వాకాడ్ ప్రాంతంలోని 'సిగ్నేచర్ పార్క్' అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం సాయంత్రం సుమారు 6.30 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా భారీ శబ్దం వచ్చింది. అప్రమత్తమైన స్థానికులు బయటకు వచ్చి పరిశీలించగా.. భవనంలోని డక్ట్ ప్రాంతంలో 33 ఏళ్ల మహిళ, ఆమె ఆరేళ్ల కుమారుడు రక్తపు మడుగులో పడిపోయి కనిపించారు. ఈ హృదయ విదారక దృశ్యాన్ని చూసి స్థానికులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. వెంటనే అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వాకాడ్ పోలీసులు క్షణాల వ్యవధిలో ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతులను ఏక్తా భాంగ్డే (33), ఆమె కుమారుడు మాధవ్ (6)గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

తాగునీటి ఎద్దడిపై సీతక్క అలర్ట్



- ప్రత్యామ్నాయ తాగునీటికి ప్రత్యేక నిధులు
- సింగూరుకు ₹120 కోట్లు.. జిల్లాలకు ₹కోటి
- నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ఆదేశాలు

నిర్భయవార్త ప్రతినిధి : ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి ఎద్దడి తలెత్తే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్ల కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క తెలిపారు. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో సింగూరు ప్రత్యామ్నాయ తాగునీటి అవసరాల కోసం రూ.120 కోట్లు, ఇతర జిల్లాల్లో తక్షణ అవసరాల కోసం రూ.కోటి చొప్పున ప్రభుత్వం ఆమోదించిందని వెల్లడించారు. ఈ నిధులతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను వేగవంతం చేసి, ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై శనివారం ఉదయం మిషన్ భగీరథ,పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో మంత్రి సీతక్క టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి ఎద్దడి ఎదురయ్యే ప్రాంతాల్లో స్థానిక వనరులను వినియోగించుకోవాలని సూచించారు. అవసరమైన చోట బోరుబావులను అద్దెకు తీసుకోవడంతో పాటు, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు రవాణా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

వర్షపు నీటిని ఒడిసిపట్టాలి

ఇటీవల హైదరాబాద్, మేడ్చల్, ఖమ్మం, యాదాద్రి సహా పలు ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. తాగునీటి వనరుల వద్ద ఇప్పటికే నిర్మించిన ఇంకుడు గుంతలు, మ్యాజిక్ పిట్లలోకి వర్షపు నీరు చేరి ఇంకేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

నిర్భయవార్త

సంపాదకీయం

ఆదివారం 01 నవంబర్ 2026

ఎదురుదెబ్బ!?

దేశ రాజకీయాల్లో తమకు తిరుగులేదని గొప్పలు చెబుతున్న బిజెపికి ఇటీవల 4 రాష్ట్రాల్లో జరిగిన శాసనమండలి ఎన్నికల ఫలితాలు ఓ ఎదురుదెబ్బ. ముఖ్యంగా ఆర్ఎస్ఎస్ ప్రధాన కేంద్రమైన, మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీల సొంతగడ్డ నాగపూర్‌లో ఎదురైన ఓటమి కాషాయ పెద్దలకు మింగుడుపడటం లేదు. ఈ పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానాన్ని కాంగ్రెస్ వరుసగా రెండోసారి నిలబెట్టుకోవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. 1994 నుంచి 2014 వరకు ఏకబిగిన గడ్కరీ ప్రాతినిధ్యం వహించిన స్థానమిది. సంఘ్ పరివార్ కంచుకోటలో కథ మారుతోందని విశ్లేషకులు అంటున్నారు.? నాలుగు రాష్ట్రాల్లో 28 శాసనమండలి స్థానాలకు (ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలు) జరిగిన ఈ ఎన్నికల్లో విద్యావంతులు ఓటు వేశారు. మొత్తం 28 స్థానాల్లో బిజెపికి కేవలం 13 మాత్రమే దక్కాయి. పాలకపక్షం కీలక స్థానాల్లో దెబ్బతిన్నది. ప్రధాని నరేంద్ర మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలో ఉపాధ్యాయ, పట్టభద్రుల రెండు స్థానాలనూ సమాజ్‌వాదీ పార్టీ నిలబెట్టుకుంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇదే నియోజకవర్గంలో మోడీ తొలి రౌండ్లలో వెనుకబడిన విషయాన్ని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. ఫలితాలు వెలువడుతున్న వేళ ప్రధాని తన స్థాయిని మరచి బ్యాలెట్ పేపర్లతో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎన్ని సీట్లు వచ్చాయో తెలుసా అంటూ ఎద్దేవా చేశారు. కానీ మరుసటి రోజు తెల్లవారుజామునే నాగపూర్ ఫలితం కాంగ్రెస్‌కు అనుకూలంగా రావడంతో ఆ వ్యాఖ్య బెడిసికొట్టింది. దానికి స్పందనగా ఫడ్నవీస్ కూడా 'ఎక్స్'లో చేసిన పోస్టును తొలగించాల్సి వచ్చింది. వారణాసి, లక్నో, ఆగ్రాల నుంచి నాగపూర్ వరకు ఓటమికి కారణాలపై బిజెపిలో అంతర్మథనం మొదలైంది.?యోగి జమానా ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, ఫైజాబాద్‌లో కేవలం 307 ఓట్లతో బిజెపి గట్టెక్కింది. మహారాష్ట్ర ఎంఎల్‌సి ఫలితాలు మహాయుతి కూటమిలో చిచ్చును రాజేశాయి. బిజెపి, శివసేన (ఏక్‌నాథ్ షిండే) పార్టీలు పరస్పరం నిందించుకుంటున్నాయి. కూటమి ధర్మాన్ని పాటించలేదంటూ బిజెపి, పూర్తిగా సహకరించలేదని శివసేన వాదించుకున్నాయి. పూణె ఉపాధ్యాయుల నియోజకవర్గంలో చివరి నిమిషంలో స్వతంత్ర అభ్యర్థికి ఆ పార్టీ మద్దతివ్వడం దెబ్బతీసిందని చెబుతోంది. ఏక్‌నాథ్ షిండే సహకరించనందుకే ఓడిపోయామంటూ దీర్ఘాలు తీస్తోంది. దీంతో పొత్తు ఉండాలా? వద్దా? తేల్చుకోవాలంటూ నేతలు తేల్చిచెప్పడం గమనార్హం. అయితే, 288 సీట్ల అసెంబ్లీలో బిజెపికి 132 మంది ఎమ్మెల్యేలుంటే, మెజారిటీకి 145 మంది కావాలి, ప్రభుత్వం కొనసాగాలంటే మిత్రుల మద్దతు లేకుండా ప్రభుత్వం నడవడం సాధ్యం కాదు. అంతుకుమించి బీహార్ మోడల్‌ను ఉటంకిస్తూ ఏక్‌నాథ్ షిండేను మహారాష్ట్ర సిఎం చేయాలంటూ కొత్త వాదన తెస్తున్నారు. దీంతో కొలిమంటుకుపోతుందని బిజెపి నాయకత్వం నిట్టూరుస్తోంది. ఇదిలా ఉంటే, డబ్బుదస్కం, నగానట్రా వంటి ఎన్ని ప్రలోభాల వల విసిరినా మహాయుతి కూటమి విద్యావంతుల విశ్వాసాన్ని పొందలేకపోయిందనేది విశ్లేషకుల మాట.? బీహార్‌లోని దర్భంగా పట్టభద్రుల స్థానంలో నాటకీయ పరిణామాలు జరిగాయి. మొదటి ప్రాధాన్యత ఓట్లలో వెనుకబడిన ఆర్‌జెడి అభ్యర్థి అనిల్ కుమార్ ఝా, రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో 450 ఓట్ల తేడాతో బిజెపి అభ్యర్థిని ఓడించారు. బిజెపి సంబరాలు మొదలుపెట్టిన తర్వాతే ఈ ఫలితం వచ్చింది. ప్రశాంత్ కిషోర్ జన్‌సురాజ్ పార్టీ, దర్భంగా ఉపాధ్యాయ స్థానంలో కాంగ్రెస్ సిటింగ్ ఎంఎల్‌సిని ఓడించడంతో పాటలీపుత్రలో రాజకీయాలు వేడెక్కాయి. కర్ణాటకలో బిజెపి-జెడిఎస్ కూటమి నాలుగు స్థానాలనూ గెలుచుకుంది. డికె శివకుమార్ తొలి ఎన్నికల పరీక్షలో పట్టు తప్పారు. అది ఆ పార్టీ స్వయంకృతాపరాధమేనని విశ్లేషకుల మాట.? నిరుద్యోగం, పరీక్షల్లో అక్రమాలు, విద్యారంగ సంక్షోభం, ధరల భారంపై విద్యార్థి, ఉపాధ్యాయ, కార్మిక, రైతు సంఘాలు, వామపక్షాలు, ఇతర సెక్యులర్ పార్టీలు సాగిస్తున్న ఉద్యమాలకు ఈ ఫలితాలు ఊతమిస్తున్నాయి. వీధుల్లోని ప్రజాగ్రహం ఓటింగ్ కేంద్రాల్లో ప్రతిబింబిస్తోందని, ఆ సంకేతాలు ఫలితాల్లో కనిపిస్తున్నాయని పలువురు విశ్లేషిస్తున్నారు. ఈ ఎన్నికలు పరిమిత ఓటర్లతో జరిగేవే. అయినా వచ్చే ఏడాది జరగనున్న ఉత్తరప్రదేశ్ ఎన్నికలకు ముందు వచ్చిన ఈ తీర్పు, పాలకుల విధానాలకు, ప్రజలతో వ్యవహరించే తీరుకు ఇచ్చిన గట్టి హెచ్చరికే.

రాష్ట్రాన్ని పీడిస్తున్న నిరుద్యోగం, అధిక ధరలు, పర్యావరణ ముప్పు

రాష్ట్రంలో నిరుద్యోగం ప్రబలిపోతున్నది. ఐ.టి పై ఆశలు పెట్టుకున్న యువత నిరాశకు గురవుతున్నది. ప్రతి సంవత్సరం లక్ష మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు, 65 వేల మంది డిప్లమా హోల్డర్లు చదువులు పూర్తి చేసుకొని బయటకు వస్తున్నారు. ఇంజనీరింగ్ పూర్తి చేస్తే ఐ.టి ఉద్యోగం గ్యారెంటీ అన్న ఆశతో తల్లిదండ్రులు కూడా అప్పులు చేసి మరీ చదువులపై పెట్టుబడులు పెడుతున్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినా స్కిల్స్ లేవనే పేరుతో మరలా సర్టిఫికెట్ కోర్సులకు ఏ హైదరాబాదో, బెంగళూరో వెళ్ళి పిజి హాస్టళ్లలో ఉంటూ కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటున్నారు. క్యాంపస్ రిక్రూట్‌మెంట్లు దాదాపుగా జరగడం లేదు. జరిగినా అప్పాయింట్‌మెంట్ లెటర్ రాదు. లెటర్ ఇచ్చినా బెంచిపై ఉంచడంతో నేర్చుకున్నది కూడా మర్చిపోతామని రాజీనామా చేసి మరోదారి వెతుక్కుంటున్నారు. ఐ.టి జాబ్ మార్కెట్‌లో కొద్దో గొప్పో ఓపెనింగ్స్ ఉన్నా ఏ.ఐ పేరుతో మధ్యంతర దశలో ఉన్న వేలాదిమంది ఉద్యోగులను తొలగించేస్తున్నారు. గత ఆరు మాసాల్లో దాదాపు 2 లక్షల మందిని ఇంటికి సాగనంపారు. తాజాగా మైక్రోసాఫ్ట్ ప్రపంచవ్యాపితంగా 60 వేల మందికి విఆర్ఎస్ ఇచ్చారు. అందులో 23 వేల మంది మన దేశీయులే. ఇంకొంత మందిని తొలగిస్తారని అంచనా. టిసిఎస్, విప్రో, ఇన్ఫోసిస్, గూగుల్, ఫేస్‌బుక్, యాక్సెంచర్ వగైరా కంపెనీలన్నీ ఫైర్ చేసే పనిలో నిమగ్నమై ఉన్నాయి. ఓపెనింగ్స్‌లో కొత్తగా ఒకరిని తీసుకుంటే పాతవారిని పది మందిని తీసివేస్తున్నారు. ఒక ఉద్యోగం వస్తే పది మంది వారిపై ఆధారపడి బతుకుతారని ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలంటూ చంద్రబాబు ఊదరకొడుతున్నారు. అదే ఒకరిని తీసేస్తే పదిమంది ఇంటికి పోతారని మాత్రం చెప్పడం లేదు. నేడు జరుగుతున్నదదే. అప్పులు చేసి చదువుకున్న నిరుద్యోగుల కథ కంచికి చేరుతున్నది. ఈ సంక్షోభంతో ఇంజనీరింగ్ చదివేవారి సంఖ్య తగ్గిపోయి సీట్లు ఖాళీగా మిగిలిపోతున్నాయి. 65 శాతం ఇంటర్‌తోనే చదువు మానేస్తున్నారు.ఉద్యోగాలు తీసేస్తే ఒకటి లేదా రెండు నెలలు జీతం ఇచ్చి పంపించేస్తున్నారు. అమెరికా లాంటి దేశాలకు వీసాలు దొరకడం బాగా తగ్గిపోయింది. అక్కడున్నవారు కూడా ఉద్యోగాలు ఉంటాయో ఊడతాయో తెలియక, తిరిగి రాలేక నానా అవస్థలు పడుతున్నారు. ఇలాంటి స్థితిలో నిరుద్యోగుల భవిష్యత్తు అంధకారంగా మారింది. అందుకే నిరాశా, నిస్పృహల నుండి బయటపడి ఇప్పుడు పోరాట మార్గం పట్టారు. దాన్నే మనం 'నీట్' ఉద్యమ రూపంలోనూ ఇప్పుడు 'సర్' వ్యతిరేక పోరాటంలోనూ చూస్తున్నాం. మన దేశంలోనే కాదు ఫ్రాన్స్, సెర్బియా లాంటి యూరోపియన్ దేశాల్లో, మన ఇరుగు పొరుగు దేశాల్లోనూ అలాంటి పరిణామాల్నే చూస్తున్నాం.

నిరుద్యోగంలో ఆంధ్రాదే అగ్రస్థానం

దేశంలోనే నిరుద్యోగంలో మన రాష్ట్రం మొదటి లేదా రెండవ స్థానంలో ఉంది. జాతీయ స్థాయి నిరుద్యోగం రేటు 5.4 శాతం ఉంటే మన రాష్ట్రంలో 8.3 శాతం ఉంది. అమెరికా లాంటి పెట్టుబడిదారీ దేశాలతో సహా మన దేశంలోనూ నిరుద్యోగం పెరుగుతున్న నేపథ్యంలో కొత్త తరం యువతలో (జెన్-జి) నిస్పృహ పెరుగుతున్నది. పెట్టుబడిదారీ పోటీ ప్రపంచంలో ఒకరిపై మరొకరు పైచేయి సాధించేందుకు టెక్నాలజీని అప్‌గ్రేడ్ చేసి మానవ శ్రమని తగ్గించుకుంటూ పోతుంటారు. ఏ.ఐ పరిణామ క్రమం కూడా అందులో భాగమే. దీనిని ఉద్యోగాల తొలగింపునకు ఉపయోగించొచ్చు లేదా ఉద్యోగాల నియామకానికి ఉపయోగించుకోవచ్చు. అది ఆయా దేశాల సామాజిక పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. మనలాంటి దేశాల్లో ప్రభుత్వ రంగం బలహీనపడి ప్రైవేటు రంగం విస్తరిస్తున్న దశలో లాభాలే పరమావధిగా మానవ (శారీరక, బౌద్ధిక) శ్రమను దోచుకుంటున్నారు. ప్రభుత్వ విధానాలు, లేబర్ కోడ్స్ దీనికోసమే రూపొందించబడ్డాయి. సామూహిక బేరసారాలాడకుండా ఎవరికి వారు వారి జీతభత్యాల గురించి ఆలోచించే విధంగా ఉద్యోగ విధానాల్లో మార్పు తీసుకువచ్చారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, డైలీ వేజ్, ఫిక్స్‌డ్ టర్మ్ వగైరావన్నీ ఇలాంటివే. ఏ ఉద్యోగమూ దొరకనివారు స్విగ్గీ, ఓలా లాంటి గిగ్ లేదా ప్లాట్‌ఫాం తరహా అస్థిరమైన వివిధ రకాల పనులు చేస్తున్నారు. క్రమంగా వాటికి కూడా డిమాండు పెరిగి నిరుద్యోగులు పోటీ పడుతుండడంతో హీనమైన వేతనాలకు కూడా గొడ్డుచాకిరి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎస్సీ, ఎస్టీలు, మహిళల పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది.

ఉద్యోగాలు కాదు భ్రమలు సృష్టిస్తున్నారు

యువతరంలో వస్తున్న ఈ అసంతృప్తిని పాలకవర్గాలు ఉపయోగించుకొని డబుల్ ఇంజన్ సర్కార్ అంటూ అధికారాన్ని కేంద్రీకరించుకుంటున్నాయి. అవిగో ఉద్యోగాలు, ఇదిగో ఉపాధి అంటూ పెద్ద ఎత్తున విదేశీ పెట్టుబడులు వచ్చేస్తున్నాయి, లక్షల సంఖ్యలో ఉద్యోగాలిస్తామని భ్రమలు పెడుతున్నారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా, పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా, లోకేష్ విద్యాశాఖా మంత్రిగా రావడంతో నిరుద్యోగుల్లో ఆశలు మరింతగా పెరిగాయి. కానీ ఈ రెండున్నర సంవత్సరాల్లో ప్రకటనలు, ప్రణాళికలు తప్ప ఉద్యోగాలు ఇచ్చింది లేదు. ఎం.ఒ.యు లు తప్ప పెద్దగా పెట్టుబడులూ వచ్చింది లేదు. ఇండస్ట్రియల్ పార్కులు, కారిడార్‌లు అంటూ దీర్ఘకాలిక ప్రణాళికలతో రోజూ మోత మోగిస్తున్నారు తప్ప అవి ఎప్పటికి వాస్తవ రూపం ధరిస్తాయో ఎవరూ చెప్పలేకున్నారు.రాష్ట్ర ప్రభుత్వాలు పోటీలు పడి ఆఫర్‌లు ఇస్తున్నా భూములు, సబ్సిడీలు, రుణాలు తీసుకుంటున్నారు తప్ప పరిశ్రమలు పెట్టడం లేదు. తాజాగా హెచ్.పి కంపెనీ ఎన్.ఇ.జెడ్ నుండి ఉపసంహరించుకున్నది. ఎక్కువ మందికి ఉపాధి కల్పించే అనేక చిన్న, మధ్యతరహా పరిశ్రమలు సరైన ప్రోత్సాహం లేక మూతపడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీలు రూ.5 వేల కోట్లు 4 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయి. నవాకార చక్కెర ఫ్యాక్టరీలు, నూలుమిల్లులు, డెయిరీలు మూతపడుతున్నాయి. టెక్స్‌టైల్స్ సంక్షోభంలో ఉంది. ఫలితంగా నిరుద్యోగం మరింత ఎక్కువగా పెరుగుతున్నది. రాష్ట్రంలో 29 చక్కెర ఫ్యాక్టరీలుండగా అందులో 27 మూతపడి 2 మాత్రమే నడుస్తున్నాయి. వాటిలో మరొకటి ఎప్పుడైనా మూతపడొచ్చు. వీటిల్లో ఉద్యోగాలు కోల్పోయిన వారికి ఇప్పటికీ సరైన పరిహారం అందలేదు.

కాలుష్యంతోనే ఎల్‌నినో

భారతదేశం డంప్ యార్డుగా మారుతున్నది. ఉపాధి కల్పించలేని డేటా సెంటర్లకు పెద్దపీట వేస్తున్నదీ ప్రభుత్వం. ఉద్యోగాలు కల్పిస్తామని భ్రమలు పెట్టి మన భూములు, విలువైన, అరుదైన ఖనిజాలు, నీరు, గాలి, సూర్యరశ్మి వగైరా సహజ వనరులను కార్పొరేట్ కంపెనీలు కొల్లగొడుతున్నాయి. ఫలితంగా పర్యావరణానికి ఎనలేని ముప్పు ఏర్పడుతోంది. దాని దుష్ఫలితమే ఎల్‌నినో. వర్షాలు లేవు. పంటలు పండలేదు. కాన్సర్, కిడ్నీ లాంటి వ్యాధులు పెరుగుతున్నాయి. మురుగు పెరిగి అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. చిన్నపాటి వర్షాలు వచ్చినా పట్టణాలు మునిగిపోతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ లేక దోమలు ముసురుకుంటున్నాయి. నదులు పారిశ్రామిక కాలుష్యంతో నిండిపోతున్నాయి. మంచినీరు దొరక్క కొనుక్కోవాల్సిన దుస్థితి వచ్చింది. మానవజాతి మనుగడకు నేడు పర్యావరణ పరిరక్షణ ముఖ్యమైన ఎజెండాగా మారింది. అందుకే డేటా సెంటర్లు, అణు విద్యుత్ కేంద్రాలు, రసాయన పరిశ్రమలకు వ్యతిరేకత పెరుగుతోంది.

ఆదాయ వ్యత్యాసాలే అసలు సమస్య

ఉన్న పరిశ్రమలు మూతపడడం, కొత్త పరిశ్రమలు రాకపోవడం, సర్వీసు రంగం వెనకబడడం, వ్యవసాయ సంక్షోభం తదితర కారణాలతో ప్రజలకొచ్చే ఆదాయ వనరులు బాగా తగ్గిపోయాయి. వేతనాలు పెరగడం లేదు. కొనుగోలు శక్తి పడిపోయింది. ఇంకోవైపు ఈ సంవత్సరం ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక సాగు సంక్షోభంలో పడింది. గ్రామీణ ప్రజల ఆదాయాలు పడిపోయాయి. ఇప్పటి వరకు మార్కెట్ విస్తరణకు ఆలంబనగా ఉన్న గ్రామీణ ప్రాంతాలో ఆదాయాలు తగ్గి సంక్షోభంలో పడ్డాయి. వ్యవసాయోత్పత్తి దెబ్బ తినడంతో ఆహార ఉత్పత్తులను బ్లాక్ మార్కెట్‌కి తరలించి పెద్ద ఎత్తున నిల్వ చేసుకొని ఒక్కసారిగా ధరలు పెంచేస్తున్నారు. గత రెండు మాసాల్లోనే 50 శాతం ధరలు పెరిగాయి. ప్రాజెక్టుల కింద వరి విస్తీర్ణం తగ్గడంతో బియ్యం ధరలు కొండెక్కాయి. రెండు మాసాల క్రితం కిలో రూ.45 ఉన్న ఫైన్ వెరైటీ ఇప్పుడు రూ.65, సోనా రూ.70, ఫైన్ వెరైటీ రూ.80, సూపర్ ఫైన్ రూ.100 కు చేరుకుంది. ఉల్లిపాయలు 100 శాతం పెరిగాయి. పాలు, చక్కెర, నూనె, చింతపండు, పప్పులు, సబ్బులు వగైరా నిత్య జీవితావసరాలన్నీ అమాంతం పెరిగిపోయాయి. మందుల ధరలు పెరిగాయి. షుగర్, బిపి వ్యాధిగ్రస్తుల బడ్జెట్ పెరిగింది. ఆరు మాసాల క్రితం 4.6 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం రేటు నేడు 6.7 శాతానికి పెరిగింది. అంటే 50 శాతం ద్రవ్యోల్బణం రేటు పెరగడం అసాధారణమైన విషయం. ప్రజల ఆదాయాలు తగ్గి ధరలు పెరగడం వల్ల నిత్యావసరాలు కుదించుకోలేక అప్పులు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలు దీనిని భరించలేక పిల్లలతో సహా ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు ఇటీవల బాగా పెరిగాయి. ఇంతకు ముందు రైతు ఆత్మహత్యలే చూశాము. ఇప్పుడు చిన్న వ్యాపారుల, మధ్యతరగతి ప్రజల ఆత్మహత్యలు కూడా చూస్తున్నాము. అటు ర్యాంకుల కోసం ప్రైవేటు విద్యాలయాలు ఇటు తల్లిదండ్రులు ఒత్తిడి భరించలేక జీవితంపై విరక్తితో విద్యార్థులు కూడా ఆత్మహత్యలకు పాల్పడడం ఆందోళన కలిగిస్తుంది. ఈ పరిణామం ఒక సామాజిక సమస్యగా మారింది.

ఉరకలెత్తుతున్న జెన్-జి చైతన్యం

ఈ స్థితిలో కొత్త తరం జెన్-జి ఆకాశం నుండి భూమికి దిగుతున్నది. రానున్న నవతరం (జెన్-ఆల్ఫా) కూడా తిరుగుబాటుకు సిద్ధమవుతున్నది. ఈ అసమ్మతి నుండే సిజెపి ఆవిర్భవించింది. విద్యార్థి సంఘాల నుండి సమరశీల నాయకత్వం ముందుకొచ్చింది. కొత్త తరంలో వస్తున్న చైతన్యాన్ని దెబ్బకొట్టి వారిని నిరాయుధుల్ని చేయడానికి ఓటు హక్కును లాగేసుకుంటున్నారు. 'సర్' పేరుతో జరుగుతున్న తతంగంలో మైనారిటీలు, వలస కూలీలే కాదు...కొత్త తరం ఓటర్ల సైతం తొలగించబడుతున్నారు. కర్ణాటకలో తాజాగా 64 లక్షల మంది ఓటర్లను తొలగిస్తే అందులో 38 లక్షల మంది 30 సంవత్సరాల లోపు వారు కావడం గమనార్హం. మన రాష్ట్రంలో ఇంత వరకు లెక్కలే ప్రకటించలేదు. యువతరంలో వస్తున్న అసమ్మతిని భరించలేని మోడీ, చంద్రబాబు డబుల్ ఇంజన్ సర్కారు ఆందోళనలపై బుల్డోజర్లు తోలుతున్నది.ఒకవైపు నిర్బంధం మరోవైపు మనువాద, మతోన్మాద భావజాలంతో యువతరాన్ని బ్రెయిన్ వాష్ చేయడానికి మోడీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ పరివారం కలిసికట్టుగా ప్రయత్నిస్తున్నాయి. కేంద్రానికి లొంగిపోయిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ లాంటి వారు కూడా వీరికి భజన చేస్తున్నారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగ పోరాటం విజయవంతమైనా, 'నీట్' వ్యతిరేక పోరాటం ద్వారా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినా, ప్రస్తుత 'సర్' వ్యవహారంలో సుప్రీం కోర్టు మార్గదర్శకాలిస్తున్నా ప్రజా ఉద్యమాల ఒత్తిడి ఫలితమే. ముఖ్యంగా సాధారణ మధ్యతరగతి యువతే కాకుండా బిజెపి, ఆర్ఎస్ఎస్ కుటుంబాల్లోని యువతీ, యువకులు కూడా ఇలాంటి ఉద్యమాల్లో పాల్గొనడానికి ధైర్యంగా ముందుకొస్తున్నారు. ప్రభుత్వ నిర్బంధాలు, సోషల్ మీడియాలో ట్రోలింగ్ లాంటి భయాల నుండి బయటపడుతున్నారు. ధైర్యంగా ఉద్యమిస్తున్న యువ తరానికి కార్మిక, కర్షక తదితర కష్టజీవుల నుండి సంఘీభావం వ్యక్తమవుతున్నది. అనేకమంది తల్లిదండ్రులు కూడా పిల్లల్ని ఉద్యమాల్లోకి పంపడానికి ప్రోత్సహిస్తున్నారు. ఇదొక కొత్త పరిణామం. గత 35 సంవత్సరాల్లో రాజకీయ రహితం కావించబడ్డ తరానికి భిన్నమైన కొత్త తరం కొత్త మార్గాన్ని ఎంచుకుంటున్నది. ఈ మార్పును ముందుకు తీసుకుపోవడమే నేడు ప్రగతిశీల శక్తుల ముందున్న కర్తవ్యం.

వి. శ్రీనివాసరావు



రాష్ట్ర ఐకమత్యం, సమగ్రతకు సర్దార్ పటేల్ సేవలు చిరస్మరణీయం

రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా కలెక్టరేట్‌లో ప్రతిజ్ఞ చేయించిన అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి





మేడ్చల్ మల్కాజిగిరి, కలెక్టరేట్ అక్టోబర్ 31 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రీయ ఏక్తా దివస్‌ను నిర్వహిస్తున్నామని, దేశ ఐకమత్యం, సమగ్రతను కాపాడటంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతితో కలిసి ఆయన కలెక్టరేట్ అధికారులు, సిబ్బందితో జాతీయ ఐక్యతా దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడేందుకు అంకితభావంతో కృషి చేస్తామని, సహచరుల్లోనూ జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించేందుకు శాయశక్తులా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ దార్శనికతతో దేశానికి సమకూరిన అంతర్గత భద్రతను మరింత పటిష్టం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ సీతారాం, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాయక్ నగర్ బంజారా కాలనీలో విద్యుత్ సమస్యకు పరిష్కారం

కొత్త విద్యుత్ స్తంభాలు, వీధి దీపాల ఏర్పాటు.. వితల్ నాయక్



కాప్రా, అక్టోబర్ 31నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: కాప్రా డివిజన్ పరిధిలోని నాయక్ నగర్ బంజారా కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి, కాప్రా డివిజన్ మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి సహకారంతో కాలనీలో నూతన విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలను ఏర్పాటు చేసినట్లు మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వితల్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో చాలాకాలంగా వీధి దీపాలు వెలగకపోవడం, పాత విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకుని విరిగిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాలనీవాసులు తమ సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. వారు వెంటనే స్పందించి సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి నూతన స్తంభాలు, వీధి దీపాల ఏర్పాటు చేయించారని వివరించారు. అలాగే గత రాత్రి వీచిన ఈదురుగాలులు, వర్షం కారణంగా విద్యుత్ తీగ తెగిపడగా, సిబ్బంది తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. కాలనీ సమస్యల పరిష్కారానికి సహకరించిన మందుముల పరమేశ్వర్ రెడ్డి, స్వర్ణరాజ్ శివమణికి నాయక్ నగర్ బంజారా కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తన్నీరు శ్రీహరి, కాంగ్రెస్ నాయకులు జి. సత్యనారాయణ, నాయక్ నగర్ బంజారా కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పార్వతి, వాల్య నాయక్, రమేష్, రవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు పరిరక్షణ నినాదంతో కాంగ్రెస్ నాయకుల ఢిల్లీ పర్యటన



కూకట్‌పల్లి, అక్టోబర్ 31 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: దేశ రాజధాని న్యూఢిల్లీలో నిర్వహించనున్న ‘ఓటు బచావో -- దేశ్ కూ బచావో’ కార్యక్రమంలో పాల్గొనేందుకు కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో 30 మందికి పైగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు ఢిల్లీకి బయలుదేరారు.తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు సీనియర్ నాయకులు, జేఏసీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు పయనమయ్యారు. ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం, నాయకుల మధ్య ఐక్యత, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించనున్నట్లు నాయకులు తెలిపారు.

నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం కీలకం

గంజాయి విక్రయదారులపై ఉక్కుపాదం.. అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా
ప్రజల భద్రతకు భరోసా కల్పించడమే లక్ష్యం -- పోలీస్ కమిషనర్ సునీల్ దత్



ఖమ్మం, అక్టోబర్ 31 -- నిర్భయవార్త: ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తూ, నేరాల నియంత్రణలో ప్రజలను భాగస్వాములను చేయడమే లక్ష్యంగా కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. నేరరహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు పోలీస్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.టేకులపల్లి ప్రాంతంలోని కేసీఆర్ టవర్ పరిసరాల్లో కొంతమంది గంజాయి సేవిస్తూ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో శనివారం ఖమ్మం డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సీఏఆర్ ఫోర్స్, టాస్క్ ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, సెంట్రల్ క్రైమ్ స్టేషన్, ఈగల్ ఫోర్స్, క్లూస్ టీమ్ తదితర విభాగాలకు చెందిన మొత్తం 286 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 52 బ్లాకుల్లోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి, అనుమానాస్పద వ్యక్తుల వివరాలను సేకరించారు. సరైన ధ్రువపత్రాలు లేని 62 ద్విచక్ర వాహనాలు, ఐదు ఆటోలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 105 మంది వేలిముద్రలను సేకరించి పరిశీలించారు. గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని, గంజాయి సేవిస్తున్న 12 మందిని గుర్తించడంతో పాటు 50 గ్రాముల పొడి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు చోరీ నిందితులు, ఇద్దరు అనుమానితులను కూడా గుర్తించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ.. స్థానిక ప్రజలు కోరిన మేరకు ఆ ప్రాంతంలో పోలీస్ పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేస్తామని తెలిపారు. బెల్ట్ షాపులపై ఎక్సైజ్ శాఖతో సమన్వయం చేసుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. యువత చెడు అలవాట్లకు, మాదక ద్రవ్యాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

గంజాయి రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలి

గంజాయి విక్రయదారుల సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని, యువత భవిష్యత్తును కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కుటుంబం కోసం, పిల్లల భవిష్యత్తు కోసం మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. నేటి అప్రమత్తతే రేపటి పిల్లల భద్రమైన భవిష్యత్తుకు పునాది అని పేర్కొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలకు అడ్డుకట్ట

ప్రజలు తమ ఇళ్లు, కాలనీల భద్రత కోసం స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించడంతో పాటు నేరస్తుల కదలికలను గుర్తించడం సులభమవుతుందన్నారు. స్థానికంగా ఎలాంటి గొడవలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణాన్ని కాపాడుకోవాలని కోరారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అక్రమ సంపాదనకు అలవాటు పడి మోసాలకు పాల్పడే వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. ఆన్‌లైన్ సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు అడిగే ఫోన్ కాల్స్, ఈమెయిల్స్‌కు స్పందించవద్దని సూచించారు. అపరిచిత వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని తెలిపారు.

ఇళ్లను అద్దెకు ఇచ్చే సమయంలో అద్దెకు తీసుకునే వ్యక్తుల చిరునామా, ఆధార్ వంటి గుర్తింపు పత్రాలను పరిశీలించిన తర్వాతే ఇల్లు ఇవ్వాలని సూచించారు. నేరాల నియంత్రణకు పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు, బ్లూకోల్ట్స్ సిబ్బంది నిరంతరం పర్యటిస్తూ ఆయా ప్రాంతాల పరిస్థితులను పర్యవేక్షిస్తారని, పాత నేరస్తుల సమాచారాన్ని సేకరిస్తారని వివరించారు. ప్రజల్లో అభద్రతాభావం తొలగించి భద్రత కల్పించేందుకు ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీలు రమణమూర్తి, ఎస్బీ ఏసీపీ మహేష్, సైబర్ క్రైమ్ ఏసీపీ ఫణీందర్, సీసీఎస్ ఏసీపీ సర్వర్, సీఐలు సాదిక్ పాషా, చిట్టిబాబు, కరుణాకర్, శివప్రసాద్, నాగరాజు, ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని జీవితంలో ఎదగాలి -- ఎక్సైజ్ సీఐ పి. లింగ గౌడ్
ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం



కారేపల్లి /సింగరేణి, అక్టోబర్ 31 నిర్భయవార్త. విద్యార్థులు గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ, క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవర్చుకోవాలని సింగరేణి ఎక్సైజ్ సీఐ పి. లింగ గౌడ్ సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు పట్టుదలతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.సింగరేణి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఖమ్మం జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎక్సైజ్ సీఐ పి. లింగ గౌడ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, ఈ సమయంలో చెడు అలవాట్లకు బానిసలైతే బంగారు భవిష్యత్తును నాశనం చేసుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల వినియోగం ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని, దానిని చేరుకునేందుకు ఇష్టంతో, బాధ్యతతో చదువుకోవాలని సూచించారు.తల్లిదండ్రుల కోసమో, ఉపాధ్యాయుల కోసమో కాకుండా తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలనే సంకల్పంతో విద్యనభ్యసించాలని హితవు పలికారు. మంచి విద్య, క్రమశిక్షణ, సత్ప్రవర్తన కలిగినప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి యువత ముందుండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ విజయకుమారి, అధ్యాపక బృందం, ప్రజల యువజన సంఘం అధ్యక్షులు పాపయ్య, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్, ఎక్సైజ్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు

మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఘన నివాళులు



జవహర్‌నగర్, అక్టోబర్ 31 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: భారత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని జవహర్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఇందిరాగాంధీ అందించిన సేవలను, జాతీయ సమైక్యత, సమగ్రత కోసం ఆమె చేసిన కృషిని స్మరించుకున్నారు. మాజీ మేయర్, జవహర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, పల్లె సత్యం, వంశరాజ్, మాజీ కార్పొరేటర్లు శారదా, మనోహర్ రెడ్డి, ప్రేమల శ్రీనివాస్, మేడ్చల్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాట్ల శ్రీనివాస్, జవహర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మాట్ల వినయ్ కుమార్, ప్రధాన కార్యదర్శులు నాయకం భాస్కర్, గజ్జేల్ శంకర్, డీఎస్ఎస్ వెంకటేశ్వర్లు, కోశాధికారి పొలాస కిరణ్ కుమార్, వీర్ల భుజంగం, జడల బాలకృష్ణ, కొలిపాక సాయికిరణ్, కన్నబోయిన రాజు యాదవ్, సుబ్రహ్మణ్యం రాజు, వడుపు రామకృష్ణ, విజయరాయి సోమేశ్ చారితో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.ఃఃః

అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటు నమోదు చేసుకోవాలి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు



సింగరేణి, అక్టోబర్ 31 -- నిర్భయవార్త:అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సింగరేణి మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు పిలుపునిచ్చారు. శనివారం భాగ్యనగర్ తండా గ్రామంలో సర్పంచ్ బానోత్ హీరాలాల్‌తో కలిసి ఆయన ఇంటింటికీ తిరుగుతూ ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోటకూరి రాంబాబు మాట్లాడుతూ.. పట్టభద్రుల ఓటరు నమోదు గడువు సమీపిస్తున్నందున అర్హులైన ప్రతి ఒక్కరూ ఆలస్యం చేయకుండా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, పట్టభద్రులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డికి మద్దతుగా పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుగులోత్ భీముడు నాయక్, మండల పార్టీ సమన్వయకర్త వాంకుడోత్ గాంధీ, ఐఎన్‌టీయూసీ నాయకులు లావు డ్యా ఈర్య, బీఎల్ఏ గుగులోత్ ప్రసాద్, వాంకుడోత్ రాంబాబు, కోఆర్డినేటర్ దారావత్ యేసు, దాస్య, బన్సీ, సామ్య తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి సామినేని రామారావు మొదటి వర్ధంతి లో నివాళి

హత్య కేసులో ప్రధాన నిందితులను గుర్తించి శిక్షించాలి



కారేపల్లి, అక్టోబర్ 31: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రూపొందించిన కథనాన్ని అమలు చేయడంలో ఖమ్మం పోలీస్ కమిషనర్ కీలక పాత్ర పోషిస్తున్నారని, సామినేని రామారావు హత్య కేసులో అసలు నిందితులను కాపాడేందుకు కట్టుకథలు అల్లి కేసును పక్కదారి పట్టిస్తున్న ఖమ్మం సీపీని వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఎం ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.శనివారం కారేపల్లి మండల కేంద్రంలో సీపీఎం పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు, పాతర్లపాడు మాజీ సర్పంచ్ అమరజీవి సామినేని రామారావు ప్రథమ వర్ధంతి కార్యక్రమం కె. నరేంద్ర అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సీపీఎం పార్టీని రాజకీయంగా దెబ్బతీయాలనే కుట్రతో సామినేని రామారావును కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే హత్య చేశారని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారని తెలిపారు. వారి వాంగ్మూలాలు, ఆధారాలు ఉన్నప్పటికీ ఏడాది కాలంగా అసలు నిందితులను గుర్తించి అరెస్టు చేయడంలో పోలీసు శాఖ విఫలమైందని విమర్శించారు. హంతకులను పట్టుకోవాలని సీపీఎం పార్టీ ఏడాది కాలంగా అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. అయితే అసలు నిందితులను తప్పించి, ఇతరులను నిందితులుగా చూపిస్తూ కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అనుకూలంగా వ్యవహరిస్తూ ఖమ్మం సీపీ పోలీస్ శాఖ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. సామినేని రామారావు హత్యకు కారణమైన అసలు నిందితులను గుర్తించి అరెస్టు చేసే వరకు సీపీఎం పార్టీ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు రామారావు గారి చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు తలారి దేవప్రకాష్ పూలమాలవేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో నాయకులు ముక్క సీతారాములు. కొండబోయిన ఉమావతి. అన్నారు కృష్ణ. కర్కపల్లి రాయమల్లు. మేకల రమేష్. శ్రీరాములు. శంకర్. అనూష తదితరులు పాల్గొన్నారు.

చెన్నాపురం, ఎర్రంపాడు గిరిజన గ్రామాల్లో కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమం

100 మంది చిన్నారులకు దుస్తుల పంపిణీ.



చర్ల అక్టోబర్ 31 నిర్భయ వార్త ప్రతినిధి.జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు, భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో చర్ల మండల పరిధిలోని చెన్నాపురం, ఎర్రంపాడు గిరిజన గ్రామాల్లో కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రెండు గ్రామాలకు చెందిన 100 మంది చిన్నారులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భద్రాచలం డీఎస్పీ గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన గ్రామాల ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని, ప్రజలకు అవసరమైన సమయంలో పోలీస్ శాఖ అండగా ఉంటుందని తెలిపారు.అనంతరం చిన్నారుల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలని, వారికి మెరుగైన విద్యను అందించేందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చర్ల సీఐ రాజు వర్మ, ఎస్సై నర్సిరెడ్డి, స్పెషల్ పార్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలి... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్.




ఖమ్మం, అక్టోబర్ 31 నిర్భయ వార్త రిపోర్టర్. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ 2026 షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం సవరించిందని కలెక్టర్ తెలిపారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం నోటీసుల పరిష్కారం, విచారణలు, అభ్యంతరాల పరిశీలన ప్రక్రియను నవంబర్ 26వ తేదీలోగా పూర్తి చేయాలని, నవంబర్ 30వ తేదీన తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు.ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 1,75,841 నోటీసులు జారీ చేయగా, వాటిలో 1,75,629 నోటీసులను ఓటర్లకు అందజేశామని కలెక్టర్ వివరించారు. మొత్తం 1,75,275 మంది ఓటర్ల విచారణ పూర్తయిందని, వీరిలో 1,74,838 మందిని తుది జాబితాలో అర్హులైన ఓటర్లుగా చేర్చేందుకు క్లియరెన్స్ ఇచ్చినట్లు తెలిపారు. వివిధ కారణాల వల్ల 1,006 మంది ఓటర్లు అర్హులు కాదని గుర్తించినట్లు పేర్కొన్నారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8 లకు సంబంధించి మొత్తం 3,080 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని తెలిపారు.వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేందుకు అర్హులైన పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.గత 2024 ఎన్నికల సమయంలో ఖమ్మం జిల్లా నుంచి మొత్తం 83,879 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారని, ప్రస్తుత నమోదు ప్రక్రియలో ఇప్పటివరకు 73,898 దరఖాస్తులు అందాయని కలెక్టర్ తెలిపారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి నమోదును మరింత పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి అర్హులైన పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలంటే తాజాగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. 25 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల పట్టభద్రులను గుర్తించి, ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నారని తెలిపారు.రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా తమ పరిధిలోని అర్హులైన పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరించి, గడువు లోగా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితా ముసాయిదాను నవంబర్ 25, 2026న ప్రచురించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముసాయిదా జాబితాపై డిసెంబర్ 10, 2026 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. డిసెంబర్ 25, 2026లోగా వాటిని పరిష్కరించి, డిసెంబర్ 30, 2026న తుది పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పీ. శ్రీజ, ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బెల్లం వేణుగోపాల్, బీజేపీ పార్టీ ప్రతినిధి వి. రాజేష్, బిఆర్ఎస్వి ప్రతినిధి ఎల్. సురేష్ బాబు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టీఆర్ కృష్ణప్రసాద్, బీఎస్పీ పార్టీ ప్రతినిధి వేల్పుల రాజయ్య, ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చార్‌ధామ్ యాత్రపై ప్రకృతి పంజా

నిర్భయవార్త ప్రతినిధి : పవిత్ర పుణ్యక్షేత్రాల దర్శనం కోసం ఆశగా.. ఆధ్యాత్మిక పరవశంతో హిమాలయాల బాట పట్టిన భక్తులను ప్రకృతి దారుణంగా పరీక్షిస్తోంది. పచ్చని కొండలు.. తెల్లటి మంచు శిఖరాల నడుమ కొలువుదీరిన చార్‌ధామ్ యాత్రలో ఇప్పుడు అడుగడుగునా ప్రమాదం పొంచి ఉంది. ఒకవైపు అకస్మాత్తుగా కురుస్తున్న భారీ వర్షాలు.. మరోవైపు గడ్డకట్టించే హిమపాతం.. వీటికి తోడు క్షణక్షణానికి మారుతున్న వాతావరణం యాత్రికులను ఆందోళనకు గురిచేస్తోంది. పుణ్యక్షేత్రాలను త్వరగా దర్శించుకోవాలనే ఉద్దేశంతో, ముఖ్యంగా వృద్ధులు, శారీరక ఇబ్బందులు ఉన్నవారు హెలికాప్టర్ ప్రయాణాలను ఆశ్రయిస్తుంటారు. ఇవి తరచు ప్రమాదాలకు గురవుతుండటంతో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు.

అడుగడుగునా ప్రమాద ఘంటికలు
ఒక వైపు హెలికాప్టర్ ప్రమాదాలు
మరో వైపు ఎడతెగని హిమపాతాలు
ఇంకో వైపు భారీ వర్షాలు, వరదలు
భక్తులకు నిత్య కష్టాలే



హెలికాప్టర్ కూలి ఆరుగురి మృతి

కాగా , శుక్రవారం ట్రాన్స్ భారత్ ఏవియేషన్‌కు చెందిన హెలికాప్టర్ టేకాఫ్ అయిన కొద్ది సేపటికే దట్టమైన మేఘాలు, భారీ వర్షం కారణంగా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌తో సంబంధాలు తెగిపోయాయి. దీంతో ఈ హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ప్రమాదంలో పైలట్ కెప్టెన్ హిమాన్షుతో పాటు ప్రతాప, అరుణ్, శంకర్ గౌడ, సుధీర్, కెహెచ్ఎస్ నటరాజ్ ప్రాణాలు కోల్పోయారు.

హిమపాతంతో వణుకుతున్న హిమగిరులు

ఈ ప్రమాదం ఒక్కటే కాదు.. కేదార్‌నాథ్ ధామ్ పరిసరాల్లో ఈ సీజన్‌లో తొలిసారిగా భారీగా హిమపాతం నమోదైంది. దీంతో కొండ ప్రాంతాలన్నీ తెల్లటి మంచు దుప్పటిని కప్పుకున్నాయి. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోవడంతో యాత్రికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉత్తరకాశీ, తెహ్రీ, హరిద్వార్ జిల్లాల్లో భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో హెలికాప్టర్లు అత్యవసరంగా ల్యాండింగ్ కావాల్సి రావడం విమాన ప్రయాణాల భద్రతపై ఆందోళన కలిగిస్తోంది.

ఘనంగా ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ వేడుకలు



మధిర అక్టోబర్ 31నిర్భయవార్త ప్రతినిధి ,:మధిర పట్టణంలో శనివారం ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో కార్మిక సంఘాల నాయకులు జెండాలు ఆవిష్కరించారు.మున్సిపాలిటీ వద్ద మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఉద్దండు, ఆర్.వి. కాంప్లెక్స్ వద్ద ఆటో యూనియన్ దిమ్మ వద్ద సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు,ఆర్

ప్రభుత్వ జూనియర్ కళాశాల మధిర ను సందర్శించిన డీఐఈఓ రవిబాబు



మధిర అక్టోబర్ 31 నిర్భయవార్త ప్రతినిధి :ప్రభుత్వ జూనియర్ కళాశాల మధిరను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి డి ఈ ఓరవిబాబు సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల లిప్రిన్సిపల్ జి.శంకర్ ఆధ్వర్యంలోజరుగుతున్న విద్యా కార్యక్రమాలను, విద్యార్థులకు అందుతున్న బోధనా విధానాలను పరిశీలించారు. డీఈవో మాట్లాడుతూ కళాశాల లిఅభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రగతి, హాజరు శాతం, స్టడీ అవర్స్ , ఒకేషనల్ అవుట్ గూర్చి, బోధనా కార్యక్రమాలలి గురించి డీఐఈఓ వివరించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, ఇంటర్మీడియట్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఏ జి ఎం ఓ ఆర్ లత, పి కమల, అరుణ,దీ సుధా అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సర్దార్ కు ఘన నివాళి



మధిర అక్టోబర్ 31 ప్రజాపాలన ప్రతినిధి మధిర స్విమర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జంగా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు ఘనంగా జరిపారు.ఉ పాధ్యక్షులు లింగంపల్లి అప్పారావు, ఆ దూరి అబ్రహం మాట్లాడుతూ.సర్దార్ వల్లభాయ్ పటేల్ 1875 అక్టోబర్ 31న గుజరాత్ లోని నడియాడ్ లో జన్మించారు.ఆయన లండన్ లో బారిస్టర్ చదివి, భారత్ కు వచ్చి స్వాతంత్ర్య ఉద్యమంలో చేరారు.1918లో ఖేడా సత్యాగ్రహం, 1928లో బార్డోలీ సత్యాగ్రహం తో ఆయనకు దేశవ్యాప్త గుర్తింపు వచ్చింది. బార్డోలీ విజయం తర్వాత మహిళలు ఆయనకు లిసర్దార్‌లి అనే బిరుదు ఇచ్చారు. ఆయనను ఉక్కు మనిషి నాన్ మనీ ఆఫ్ ఇండియా అని కూడా పిలుస్తారు.స్వాతంత్ర్యం తర్వాత భారత తొలి ఉప ప్రధాని, తొలి హోం మంత్రిగా పనిచేశారు. ఆయన గొప్పతనం 562 సంస్థానాలను భారత్ లో విలీనం చేయడం.నిజాం నుంచి హైదరాబాద్ ను విముక్తి చేయడానికి 1948లో ఆపరేషన్ పోలో నడిపించింది ఆయనే. భారతదేశ ఐక్యతకు పునాది వేసిన నాయకుడిగా ఆయన్ను గౌరవిస్తారు.ఆయన జయంతిని ప్రతి ఏటా అక్టోబర్ 31న లిజాతీయ ఐక్యతా దినోత్సవంలి గా, గుజరాత్ లోని ఆయన 182 మీటర్ల విగ్రహాన్ని లిస్టాట్యూ ఆఫ్ యూనిటీలి గా స్మరిస్తారు.ఈ కార్యక్రమంలోపల్లపోతుల ప్రసాద్ ఇన్ స్టైల్ రాము మునగాల తిరుపతిరెడ్డి షేక్ జానీ య రమలకోటిరెడ్డి శాఖమూడి బ్రహ్మయ్య మేకల ఉపేంద్ర వేమిరెడ్డి పిచ్చిరెడ్డి దాచేపల్లి రాము నీరుకొండ మురళి వాసంశెట్టి జనార్ధన్ వట్టే సైదులు చలువాది వరుణ్ లింగాల శ్రీనివాస్ ఆర్కె ఇన్ స్టైల్ తదితరులు పాల్గొన్నారు.

సామినేని హత్య కేసు విచారణకు ముఖ్యమంత్రి సిట్ ఏర్పాటుచేసి దర్యాప్తు జరపాలి,



ఎర్రుపాలెం అక్టోబర్ 31 నిర్భయవార్త ప్రతినిధి : ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హింసాత్మక రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని హింసాత్మక రాజకీయానికి బలైన సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు పాతర్లపాడు మాజీ సర్పంచ్ అమరజీవి సామినేని రామారావు హత్య కేసు దర్యాప్తు పక్కదారి పట్టించేలా సిపి విచారణ సాగుతు ందని రాష్ట్ర ముఖ్యమ ంత్రి రేవంత్ రెడ్డి సిట్ ఏర్పాటు చేసి విచారణ జరపాలని సిపిఎం పార్టీ నాయకు లు ఆగ్రహం వ్యక్తం చేశారు .సిపిఎం పార్టీ ఆధ్వర్య ంలో మండల కేంద్రమైన ఎర్రుపాలెం రింగ్ సెంటర్ వద్ద భట్టి విక్రమార్క దిష్టిబొమ్మ దహనం ను అడ్డుకొని నిరసనలు చేసే హక్కుని పోలీసులు కాలరాచారని లిసిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య మండల కార్యదర్శి మద్దాల ప్రభాకరరావులి విమర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపి సునీల్ దత్తు కేసు దర్యాప్తు తీరు పక్కదారి పట్టించేదిగా ఉందని అన్నారు. సిపి సునీల్ దత్ ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సామినేని రామారావు హత్య కేసును సంవత్సర కాలం పాటు సాగదీసి అసలు దోషులను వదిలివేసి ఎవరో నలుగురిని పట్టుకొని వచ్చి వీల్లేనిరస్తులని చెప్పటం విడ్డూరంగా ఉందని ఎద్దేవ చేశారు.సిపి మల్లు భట్టి విక్రమార్క చెప్పిన స్క్రిప్టును తయారుచేసి హత్య చేసిన దోషులను తప్పించారని విమర్శించారు. ఇప్పటికైనా సిట్ ఏర్పాటు చేసి దర్యాప్తు కొనసాగించాలని అసలు దోషులను పట్టుకొని శిక్షపడేలాగా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని లేని పక్షశీలో ఎర్ర జెండాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నల్లమోతు హనుమంతరావు, గామాసు జోగయ్య, షేక్ లాల, దూదిగం బసవయ్య, కన్నెబోయిన శ్రీను, నక్క పుల్లారావు, గొబ్బూరి కృష్ణంరాజు, పొట్టేటి నారాయణరెడ్డి, కూడెల్లి నాగేశ్వరరావు, గొల్లపూడి శ్రీహరి నారాయణ,బేతి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ విజయాలకు పాఠశాలే పునాది ఎంఈఓ చెరుపల్లి శ్రీహరి



మధిర అక్టోబర్ 31 నిర్భయవార్త ప్రతినిధి :తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రేపు ఖమ్మంలో జరగనున్న జాతీయ ప్రతిభా ఉపకార వేతనాల(ఎన్ఎమ్ఎమ్ఎస్) పరీక్షకు సిద్ధమవుతున్న మధిర మండలంలోని మాటూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చిన్నారులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మధిర మండల విద్యాశాఖ అధికారి చెరుపల్లి శ్రీహరి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ శ్రీహరి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి పోటీ పరీక్షల పై అవగాహన పెంచుకున్నట్లయితే భవిష్యత్తులో ఎటువంటి కఠినమైన పోటీ పరీక్ష అయినా సులువుగా విజయం సాధించవచ్చు అని పేర్కొన్నా రఅనంతరం మాటూరు పాఠశాలలో గత సంవత్స రం ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్ సాధించిన విద్యార్థులు పూల జస్వంత్ వేముల నరసింహారావుల ఆర్థిక సహకారంతో రేపు పరీక్ష రాయబోయే చిన్నారులకు పరీక్ష సామాగ్రి అయినటువంటి ఎగ్జామ్ పాడ్ స్కేలు వెన్నులు పెన్సిల్లు ఎరేజర్ షార్పనర్ ఉచితంగా అందించడం జరిగింది. చిన్న వయసులోనే చక్కని దాతృత్వ స్వభావం కలిగిన చిన్నారులకు ఎంఈఓ శ్రీహరి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.ఈ పోటీ పరీక్షకు చక్కగా విద్యార్థులను తీర్చి దిద్దిన గణిత శాస్త్ర ఉపాధ్యాయులు మేడేపల్లి శ్రీనివాసరావు, బౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు చౌడవరపు సునీత, జీవశాస్త్ర ఉపాధ్యాయులు లాల్ అహ్మద్ లకు ప్రత్యేకమైన అభినందనలు తెలియజేశారు.మాటూరు ఉన్నత పాఠశాల,మాటూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులుగా ఉండి, మధిర మండల విద్యాశాఖ అధికారిగా ధనపు బాధ్యతలు స్వీకరించి కూడా ఎన్ ఎమ్ ఎమ్ ఎస్ విద్యార్థులకు సోషల్ సబ్జెక్టు నందు ప్రత్యేక శిక్షణ అందించిన చెరుపల్లి శ్రీహరికి విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ప్రత్యేకత కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉ పాధ్యాయులు మేడేపల్లి శ్రీనివాసరావు, చౌడవరపు సునీత, లావుడ్య రవికుమార్, ఎం పి వి ఎ ఎస్ వి ప్రసాద్, షేక్ లాల్ అహ్మద్, ఎమ్ రవి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి అంశంలో రైతులను తప్పుదోవ పట్టించొద్దు

భాజపా జిల్లా అధికార ప్రతినిధి కస్తూరి నాగరాజు

మంచిర్యాల, అక్టోబర్ 31, నిర్భయవార్త ప్రతినిధి : జాతీయ రహదారి సమస్యల పరిష్కారం కోసం రఘునాథ్‌రావు కేంద్ర మంత్రులు, జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారులను కలిసి రైతుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారని భాజపా జిల్లా అధికార ప్రతినిధి కస్తూరి నాగరాజు తెలిపారు. ఈ విషయంలో ఆయనపై బురదజల్లడం మానుకోవాలని హితవు పలికారు. శనివారం భాజపా జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన లేఖలు, ఫొటోలను మీడియాకు చూపించారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం రైతులను పావులుగా ఉపయోగించుకోవద్దని సూచించారు.మధ్యప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు చేసిన అవినీతి ఆరోపణలను నాగరాజు ఖండించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలోనే పలు అవినీతి ఆరోపణలు వచ్చాయని విమర్శించారు. ఆధారాలు లేని ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా అధికార ప్రతినిధి రాకేష్ రెన్నా, జోనల్ అధ్యక్షుడు అమెరిశెట్టి రాజు, మున్సిపల్ కార్పొరేషన్ కన్వీనర్ బొట్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవం.



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31 నిర్భయవార్త ప్రతినిధి :సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే జాతీయ ఐక్యత దినోత్సవాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అటవీశాఖ అధికారిని బాలామణి ఆధ్వర్యంలో అటవీ రైన్జ్ అధికారి గోవింద్ చంద్ సర్దార్ అధ్యక్షతన ఐక్యత ప్రతిజ్ఞ చేసి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సమగ్రతకు ఐక్యత ఎంతగానో ఉ పయోగపడుతుందన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ భారతదేశాన్ని ఐక్యం చేయడానికి చేసిన కృషి మరువలేని,"కలిసి ఉంటే కలదు సుఖమని" నినాదాన్ని భుజాన వేసుకొని ఐక్యత భారతదేశం కోసం మహనీయులు కృషి చేశారన్నారు. వారి కృషిని గుర్తించడంతోపాటు వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు ముందుకు సాగాలన్నారు. సమగ్ర భారత దేశం కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్ కులకర్ణి, సెక్షన్ అధికారులు మహేందర్, పరెండే సాయి చరణ్, మల్లయ్య, సతీష్, యాదవరావ్, బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బియ్యం ధరలపై కీలక నిర్ణయం

నిర్ణయించిన గరిష్ట ధరలకే బియ్యం విక్రయించాలి
అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు -- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రా రెడ్డి

రంగారెడ్డి జిల్లా 31 నిర్భయవార్త ప్రతినిధి ,: తెలంగాణ రాష్ట్రంలో వివిధ రకాల బియ్యం విక్రయ ధరలపై కమిషనర్ గారితో జిల్లా మరియు రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు నిర్వహించిన సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రా రెడ్డి తెలిపారు.నిర్ణయించిన గరిష్ట విక్రయ ధరలు:- తెలంగాణ ధ్రీ బియ్యం -- కిలో రూ. 66- తెలంగాణ సోనా బియ్యం -- కిలో రూ. 74- తెలంగాణ శ్రీరామగోల్డ్ బియ్యం -- కిలో రూ. 79రైస్ మిల్లర్లు, రైస్ ట్రేడర్లు, హోల్‌సేల్ డిపో నిర్వాహకులు, రిటైలర్లు నిర్ణయించిన గరిష్ట విక్రయ ధరలకు మించకుండా బియ్యం విక్రయించాలని అదనపు కలెక్టర్ సూచించారు. వినియోగదారుల నుంచి నిర్ణయించిన ధరల కంటే అధిక మొత్తాన్ని వసూలు చేయరాదని స్పష్టం చేశారు.నిర్ణయించిన ధరలకు విరుద్ధంగా అధిక ధరలకు బియ్యం విక్రయించినట్లు గుర్తించిన పక్షంలో సంబంధిత వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.ప్రజలకు న్యాయమైన ధరలకు బియ్యం అందుబాటులో ఉండేలా సంబంధిత వ్యాపారులు నిర్ణయాలను తప్పనిసరిగా పాటించాలని అదనపు కలెక్టర్ కె. చంద్రా రెడ్డి కోరారు.



భారతదేశ ఐక్యతలో భాగస్వాములం అవుదాం

జిల్లా కలెక్టర్ కె.హరిత.



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31నిర్భయవార్త ప్రతినిధి : భారతదేశ ఐక్యతకు, సమగ్రతకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్దార్ వల్లభ భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశంలో విభిన్న భాషలు, విభిన్న సంస్కృతులు కలిగి ఉన్న దేశమని, ప్రతి ఒక్కరూ దేశ సమగ్రత, ఐక్యతకు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. దేశ భద్రతను కాపాడేందుకు, అంతర్గత భద్రతను రక్షించేందుకు ప్రజలందరూ కలిసి రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఉద్యోగులు పాల్గొన్నారు.

31/10/26 న ఉదయం చీరాల మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి చీరాల ఇంజనీరింగ్ కాలేజీ వద్ద ఎన్నికల శిక్షణ తరగతులో పాల్గొనుట, మధ్యాహ్నం నుండి కేటాయించిన పోలింగ్ స్టేషనులకు పోలింగ్ మెటీరియల్ను తీసుకొనుట.. కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్తున్న ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రొసైడింగ్ ఆఫీసర్లు మరియు అదర్ పోలింగ్ అధికారులు. ప్రొసీడింగ్ అధికారి మరియు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురజాల శ్రీనివాసరావు మాట్లాడుతూ గౌరవ జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు మంచి సమన్వయంతో పనిచేసి ఎన్నికలు సజావుగా జరిగే మంచి వాతావరణాన్ని కల్పించినందుకు అటు మున్సిపల్ యాజమాన్యం కు, పోలీసు సిబ్బందికి పాల్గొంటున్న పిఓలు,ఏపీవోలుకు ఎన్నికల సిబ్బంది అందరికీ కూడా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపినారు.



బిఆర్ఎస్ పోర్టు బ్యాంకును పెంచుకోవాలి ఎమ్మెల్సీని గెలుచుకోవాలి



తాండూర్ అక్టోబర్ 31నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై తాండూరు బీఆర్ఎస్ క్యాంప్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల తాండూరు సమన్వయకర్త శ్రీ విప్లవ్ కుమార్ గారి సమక్షంలో, తాండూరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జ్ శ్రీశైల్ రెడ్డి గారి అధ్యక్షతన ఈ సమావేశం కొనసాగుతోంది. ఈ సమావేశానికి నియోజకవర్గ వ్యాప్తంగా నియమితులైన 222 మంది ఇన్చార్జులతో పాటు అన్ని మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, ముఖ్య నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, పలువురు పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు.

ఘనంగా టి.డి.పి నేత, ఎన్.ఆర్.ఐ గిరి బాబు జన్మదిన వేడుకలు



విస్సన్నపేట,నిర్భయవార్త ప్రతినిధి : టిడిపి యువనేత వల్లభనేని గిరిబాబు పుట్టినరోజు కావడంతో గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం కలగర రామచంద్రపురం ములగల పాటి వారి గూడెం గ్రామాలలో ప్రజలు గిరిబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేకులు కట్ చేసి పంపిణీ చేశారు.విస్సన్నపేట జడ్పిటిసి అభ్యర్థిని మట్టా సుజాత వేణుగోపాల్, కలగర ఎంపీటీసీ టఎంపీపీ ఊఅభ్యర్థిని వల్లభనేని రాణి ప్రచారానికి ప్రజలు పోటెత్తారు. హారతులు పెట్టారు. స్వచ్ఛందంగా టి.డి.పి మహిళా నేతలు ముందుకు వచ్చి ఆశీర్వదించారు.ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ.. పదివేల మెజార్టీతో జడ్పిటిసి టిడిపి కైసం చేసుకోబోతుందని అదేవిధంగా 14 నుండి 16 సీట్లు వరకు కూటమి ఎంపీటీసీలు గెలవబోతున్నారని విశ్వాసం వ్యక్తం చేశారు.

అన్ని వర్గాల అభివద్ధే ధ్యేయంగా కాసాని మౌనికను గెలిపిద్దాం

గుడ్లవల్లేరు నిర్భయవార్త ప్రతినిధి :అన్ని వర్గాల అభివద్ధే ధ్యేయంగా కాసాని సుబ్బయ్య కుమార్తె, గుడ్లవల్లేరు -- 1 స్వతంత్ర్య అభ్యర్థి కాసాని మౌనిక సాయిని హార్మనియం పెట్టెకు ఓటు వేసి గెలిపిద్దామని సెగ్మెంట్ ప్రజలు కోరుతున్నారు. మౌనిక సాయి శనివారం ఇంటింటికీ తిరిగి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో కాసాని శ్రీరామ్, యార్లగడ్డ ఉమామహేశ్వరరావు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.



స్థానిక ఎన్నికలకు సమయాత్తమవుతున్న ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు

విజయవాడ, నిర్భయవార్త ప్రతినిధి : స్థానిక సంస్థలైన మునిసిపల్, కార్పోరేషన్,నగర పంచాయితీలు, ఎం.పి.టి.సి. మరియు జెడ్.పి.టి.సి. ఎన్నికల నేపధ్యంలో పోలీస్ మరియు జిల్లా యంత్రాంగం సమాయత్తమై ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా మరియు పారదర్శకమైన రీతిలో నిర్వహించడానికి పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగింది. ఈ నేపధ్యంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఎన్నికల విధి నిర్వహణలో క్యూ లైన్స్ మేనేజ్మెంట్లో స్పెషల్ పోలీస్ ఆఫీసర్లుగా బాగాస్వాములను చేస్తున్నారు. శనివారం సిటీ ఆర్మడ్ రిజర్వ్ పోలీస్ గ్రౌండ్ నందు పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు అధ్యక్షతన ఎన్నికల విధి నిర్వహణలో పాల్గొనే ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు విధులు ఏవిధంగా నిర్వహించాలనే విషయంపై కులకుషంగా దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా నగర పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ. 2026 అర్బన్ లోకల్ బాడీ ఎన్నికల నిర్వహణలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు 1100 మంది భాగస్వాములై, పోలీస్ సిబ్బందితోపాటు క్యూ లైన్స్ మేనేజ్మెంట్లో స్పెషల్ పోలీస్ ఆఫీసర్లుగా సేవలు అందించడం చాలా సంతోషకరమని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు చాలా ముఖ్యమైనవని, గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ప్రజాస్వామ్య పరిపాలన ద్వారానే సాధ్యమవుతుందని, మీరు విధులు నిర్వహించే సమయంలో ఓటర్లు అందరితో వినయంగా మాట్లాడుతూ వారిని క్యూ లైన్లలో ఓటు వేసుకుని బయటకు వెళ్ళే విధంగా చూడాలని, ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్కు మంచి పేరు తీసుకొచ్చి, వేరే రాష్ట్రాల వాళ్ళు కూడా ఏపీలో, ఎన్టీఆర్ జిల్లాలోని ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల యొక్క క్రమశిక్షణను చూసి మెచ్చుకునేలా విధులు నిర్వహించాలని తెలిపారు. మీ అందరూ సులభంగా విధులు నిర్వహించడానికి పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్స్ (బెల్ హెల్లర్స్)లను అందించడం జరుగుతుందని, వీటిని భవిష్యత్తులో పుష్కరాలకు, దసరా ఉత్సవాలు మరియు ఎన్నికల సమయంలో ఉపయోగపడే విధంగా 1150 బెల్ హెల్లర్స్ కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వెన్నెల శ్రీను , డి.సి.పి.లు కె.జి.వి.సరిత, బి.సత్యనారాయణ, ఎ.ఆర్.ఎ.సి.పి ప్రేమ కుమార్ , ఇన్స్పెక్టర్ ఎం.వి. దుర్గారావు గారు, ఆర్.ఐ.లు రాజేంద్ర ప్రసాద్ , శ్రీకాంత్ , ఎన్.ఎస్.ఎస్.కో ఆర్డినేటర్ రమేష్ , ఎస్.ఐ.లు, ఆర్.ఎస్.ఐలు, సిబ్బంది మరియు వివిధ కళాశాల లకు చెందిన ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియకు పటిష్ట పోలీసు భద్రత -- జిల్లా ఎస్పీ

ఉయ్యూరు మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ



విజయవాడ,నిర్భయవార్త ప్రతినిధి : కృష్ణా జిల్లాలో నవంబర్ 1వ తేదీన జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఉయ్యూరు పరిధిలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు పోలీసు అధికారులతో కలిసి సందర్శించి, అక్కడ చేపట్టిన భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలోని ఒక మున్సిపల్ కార్పొరేషన్తో పాటు ఉయ్యూరు, పెడన మున్సిపాలిటీలలో జరగనున్న ఎన్నికల పోలింగ్, తదనంతర కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ కోసం సుమారు 1,000 మంది సిబ్బందిని నియమించి, అవసరమైన ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా డీఎస్పీల పర్యవేక్షణలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిరంతర నిఘాతో పాటు బాడీ వార్న్ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా పరిస్థితులను పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట్ల వీడియో చిత్రీకరణ చేపట్టాలని సూచించారు.కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరినీ నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే లోపలికి అనుమతించాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధులకు ఆటంకం కలగకుండా, భద్రతా నిబంధనలకు అనుగుణంగా రెవెన్యూ శాఖ సమన్వయంతో మొబైల్ ఫోన్ల డిపాజిట్కు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు.**సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి**ఉయ్యూరు పరిధిలో రెండు ప్రాంతాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన నేపథ్యంలో అక్కడ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, అవసరమైన పోలీసు అధికారులను అందుబాటులో ఉంచి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఓటరు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు లోనుకాకుండా రాజ్యాంగం కల్పించిన తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే లేదా ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని, అటువంటి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు.

మంచినీళ్ల టాప్స్ కు మీటర్లు పెట్టడానికి తీసుకొచ్చిన జీవో నెంబర్ 160 రద్దు చేయాలి

గుడివాడ నిర్భయవార్త ప్రతినిధి :సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం స్థానిక ఎన్నికలు అయిపోయిన తర్వాత ప్రజల మీద విపరీతమైన బారాలు వేయడానికి అనేక జీవోలు తీసుకొస్తున్నారు అందులో భాగంగానే ఈరోజు 160 జీవో నెంబర్ తీసుకురావడం జరిగినది నీటి మీటర్ల ద్వారా మంచినీళ్ల టాప్స్ కు మీటర్లు జీవో కాబట్టి అదే కాకుండా ఇటీవలనే 673 జీవో తెచ్చారు మున్సిపాలిటీలో ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకి కట్టబట్టే జీవో కాబట్టి ఆ జీవో చార్జీల పేరుతో ప్రజల మీద యూజర్ చార్జీలు విపరీతంగా పడే పరిస్థితి ఉంటుంది అదే విధంగా పార్క్ వెళ్లాలన్న పార్కులో యూజర్ చార్జీలు అట్లాగే మంచినీళ్ళ పైన కూడా చార్జీలు విధించి వసూలు చేయడం జరుగుతుంది రాష్ట్రవ్యాప్తంగా అదేవిధంగా ఇప్పుడు స్పాట్ మీటర్లు పెట్టి ప్రజల మీద విపరీతమైన బారాలు వేస్తున్నారు రేపు రాబోయే రోజుల్లో ఎన్నికలు అయిన తర్వాత ప్రజల మంచినీళ్లు పైన అయిన ఖర్చులు కుడా అయిన ప్రతి పైసా ప్రజల నుండే వసూలు చేయాలనే పద్ధతిలో ఈరోజు ఈ జీవోలు తీసుకురావడం జరిగింది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 160 ను తక్షణం రద్దు చేయాలని మేము డిమాండ్ చేస్తున్నాం.రాష్ట్రవ్యాప్తంగా నిత్యవసర ధరలు విపరీతంగా పెరిగి మధ్యతరగతి ప్రజలపై అనేక భారాలు భరిస్తున్న మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హడావుడిలో ప్రజలను మభ్యపెట్టే విధంగా ఈ రోజున మంచినీళ్లు మంచినీళ్లు కుళాయిలకు మీటర్లు పెట్టి మధ్యతరగతి భేద వర్గాలను అణిచివేయాలని ఆలోచనలో తీసుకువచ్చిన జీవనం తక్షణమే రద్దు చేయాలని గుడివాడ సిపిఎం పార్టీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరుగుతుంది.ఎస్ఎఫ్ఐ కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సమరశీ,బి.వి ప్రసాద్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు




పోరుమామిళ్లలో ఘనంగా ఎఐటియుసి 107 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

దేశంలోని ఏఐటీయూసీ కార్మిక వర్గం పోరాటానికి సిద్ధం కావాలి



పోరుమామిళ్ల అక్టోబర్ 31 నిర్భయవార్త ప్రతినిధి :: :కార్మిక లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని, 8 గంటల పని విధానం కోసం కార్మికులు పోరాటానికి సిద్ధం కావాలని సిపిఐ మండల కార్యదర్శి రవికుమార్, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షులు మహమ్మద్ హుస్సేన్ (సఫా) లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ధ్వజమెత్తారు. పోరుమామిళ్ల పట్టణంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణములో ఏఐటియుసి 107 వ అరుణ పతాకాన్ని సిపిఐ మండల కార్యదర్శి రవి ఎగరవేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ నాయకుల రవి, ఏఐటీయూసీ నాయకులు సఫా మాట్లాడుతూ భారత దేశంలో కార్మికుల కోసం పోరాటం చేసిన ఏకైక కార్మిక సంఘం ఏఐటియుసి 1920 అక్టోబర్ 31 బొంబాయి నగరంలో పురుడు పోసుకొని, గ్రామ, గ్రామాన కార్మికుల సమస్యలపై నిత్యం పోరాటం చేస్తున్న ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీ అన్నారు. అలాగే కార్మికుల దోపిడీ అణిచివేత పై పోరాటం చేయడం,నేడు కార్మికులు అనుభవిస్తున్న 8 గంటల పని విధానం, కనీస వేతనాల చట్టం, పిఎఫ్, ఈఎస్ఐ, పోరాటం ద్వారా సాధించుకోవడం,స్వాతంత్ర్య ఉద్యమాలలో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను ప్రస్తుత మోడీ, చంద్రబాబు పాలక ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్చేసి 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను తొలగించి, యాజమాన్యాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చేలా తెచ్చిన 4 లేబర్ కోడ్ లను రద్దు చేసి,బానిసత్వంలోకి నెట్టివేసి కార్మికుల హక్కులను సర్వ నాశనం చేసే విధంగా చేయడం సిగ్గుచేటు అన్నారు. అలాగే రైల్వేలు,విమానాశ్రయాలు,బ్యాంకులు, బీమా నవరత్న సంస్థలను, నేషనల్ మానిటైజేషన్ పైపైన్ పేరిట బడా కార్పొరేట్లకు కారుచౌకగా అమ్మకానికి కట్టబెడుతున్నారనీ ఏఐటీయూసీగా వ్యతిరేకిస్తున్నాం. కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి పర్?

కంచికచర్ల నాలుగో సెగ్మెంట్ లో త్రిముఖ పోటీ - గెలుపు ఎవరిదో..?



కంచికచర్ల అక్టోబర్ 31 నిర్భయవార్త ప్రతినిధి :స్థానిక నాలుగో సెగ్మెంట్ లో ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది. గెలుపు కోసం మూడు ప్రధాన పార్టీలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, వేమా రోజా రమణి జనసేన పార్టీ, భారతీయ జనతా పార్టీ హోరాహోరీగా తలపడుతున్నాయి. ముగ్గురు అభ్యర్థులు ప్రతి గడపగడపకు తిరుగుతూ తమదే గెలుపని ధీమా వ్యక్తం చేస్తున్నారు.ముగ్గురు అభ్యర్థులు ప్రస్తుతం కంచికచర్లలో ప్రధానంగా వినిపిస్తున్న పేర్లు. వైసీపీ తరపునవేమా రోజా రమణి. జనసేన తరపున పసుపులేటి గోపి, బీజేపీ తరపున కాలవ మహేష్ బాబు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ముగ్గురూ ఒకే మాట చెబుతున్నారు.. "మీ సమస్యలు పరిష్కరించే బాధ్యత మాది, ప్రతి గడపకు వచ్చి మీ సమస్యలు తీర్చుతాం" అని ప్రజలకు హామీ ఇస్తున్నారు.నాలుగో సెగ్మెంట్ లో ప్రధాన సమస్యలుగా ఇంటి పట్టాల సమస్య, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం, తాగునీటి కొరత వంటివి ఉన్నాయి. ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే బాధ్యత మాదేనని ముగ్గురు అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి కష్టాలు తెలుసుకుంటూ, తమకు ఒక్క అవకాశం ఇవ్వాలని వేడుకుంటున్నారు.ప్రస్తుతం పోటీ నువ్వా నేనా అన్నట్లుగా ఉంది. ఫ్యాన్, గాజు గ్లాసు, కమలం గుర్తుల మధ్య ప్రజలు ఎవరికి పట్టం కడతారనేది ఉత్కంఠగా మారింది. ప్రజా తీర్పు ఎవరికి అనుకూలంగా ఉంటుందో అని మూడు పార్టీల్లో టెన్షన్ నెలకొంది. నాలుగో సెగ్మెంట్ ఫలితం నవంబర్ 7వ తారీఖున తేలనుంది. ఆ రోజు కోసం కంచికచర్ల ప్రజలంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఎంపీపీ అభ్యర్థి కాగిత ఉమ గెలుపు మండల అభివద్ధికి మలుపు

గుడ్లవల్లేరు నిర్భయవార్త ప్రతినిధి :: టీడీపీ ఎంపీపీ అభ్యర్థి కాగిత ఉమ గెలుపు మండల అభివద్ధికి మలుపు అని పురిటిపాడు ఎంపీటీసీ సెగ్మెంట్ ప్రజలు కోరుకుంటున్నారు. పురిటిపాడు సెగ్మెంట్లో టీడీపీ అభ్యర్థి ఉమా శనివారం ఇంటింటికీ తిరిగి సైకిల్ గుర్తుకు తనతో పాటు జెడ్పీటీసీ అభ్యర్థి వర్రె బలరామకష్ణకు గాజుగ్లాసు గుర్తుకు రెండు ఓట్లను అభ్యర్థించారు. సంక్షేమంతో పాటు అభివద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి కాగిత నరేంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



స్థానిక సంస్థల ఎన్నికల బందోబస్తుకు 'ట్రేస్ యాప్.'

జిల్లా ఎస్పీ వినూత్న ఆలోచనతో ప్రత్యేక యాప్, కమాండ్ కంట్రోల్ డాష్‌బోర్డ్ రూపకల్పన... ఆవిష్కరణ

67 పోలీసు వాహనాల లైవ్ లొకేషన్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం

ఎస్ఓఎస్ నొక్కిన వెంటనే సమీపంలోని పోలీసు వాహనానికి ఆటోమేటిక్ అలర్ట్... నిమిషాల్లో పోలీసుల స్పందన



కాకినాడ, నిర్భయవార్త ప్రతినిధి :స్థానిక సంస్థల ఎన్నికలు 2026 బందోబస్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ కాకినాడ జిల్లా పోలీసుశాఖ సరికొత్త ముందడుగు వేసింది.జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ వినూత్న ఆలోచన, మార్గదర్శకత్వంలో ప్రత్యేక మొబైల్ యాప్‌ను, కంట్రోల్ రూమ్ డాష్‌బోర్డ్‌ను రూపొందించి ఎన్నికల భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేశారు. జిల్లా ఎస్పీ శనివారం కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఈ నూతన వ్యవస్థను ఆవిష్కరించారు. జిల్లాలోని 49 రూట్ మొబైల్స్, 12 స్ట్రైకింగ్ ఫోర్స్, 6 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ వాహనాలను (మొత్తం 67), 143 పోలింగ్ ప్రదేశాలను ఒకే డిజిటల్ వ్యవస్థతో అనుసంధానించారు.

ఒకే స్క్రీన్‌పై జిల్లా ఎన్నికల బందోబస్తు

పిఠాపురం టౌన్, గొల్లప్రోలు, సామర్లకోట, పెద్దాపురం, తుని టౌన్, ఏలేశ్వరం పోలీస్ స్టేషన్ల పరిధిలోని అన్ని పోలింగ్ ప్రదేశాలను మ్యాప్‌పై గుర్తించారు. ప్రతి రూట్ మొబైల్ వాహనం లొకేషన్ ప్రతి 30 సెకన్లకు కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. ఏ వాహనం కదులుతోంది, ఏది ఆగిపోయింది, ఏ ఫోన్‌కు సిగ్నల్ లేదు అనేది డాష్‌బోర్డ్‌పై వెంటనే తెలుస్తుంది. రూట్ మొబైల్ వాహనం పోలింగ్ ప్రదేశం వద్దకు వెళ్లగానే ఆ ప్రదేశం ఆటోమేటిక్‌గా ఆకుపచ్చ రంగులోకి మారుతుంది. ఎక్కువ సమయం సందర్శించని ప్రదేశాలు ఎరుపు రంగులో కనిపిస్తాయి. దీంతో అధికారులు వెంటనే సంబంధిత వాహనాన్ని ఆ ప్రదేశానికి పంపవచ్చు.

అత్యవసర పరిస్థితిలో... సమీప వాహనానికి తక్షణ అలర్ట్

ఎక్కడైనా శాంతిభద్రతల సమస్య తలెత్తినా, అత్యవసర పరిస్థితి ఎదురైనా విధుల్లో ఉన్న అధికారి యాప్‌లో ఎస్ఓఎస్ బటన్ నొక్కితే చాలు. కంట్రోల్ రూమ్‌లో అలారం మోగుతుంది. అదే సమయంలో అత్యంత సమీపంలో ఉన్న పోలీసు వాహనానికి ఆటోమేటిక్‌గా అలర్ట్ వెళ్తుంది. ఆ వాహనంలోని అధికారి ఫోన్‌లో ఉన్న లొకేషన్‌ను నొక్కితే గూగుల్ మ్యాప్స్‌లో సంఘటనా స్థలానికి మార్గం కనిపిస్తుంది. పోలింగ్ ప్రదేశాల వద్ద ఉద్రిక్తత, జనసమూహం, సమస్యలను యాప్ ద్వారా వెంటనే నివేదించవచ్చు, ఫోటోలు పంపవచ్చు. సమస్యలు ఎక్కువగా వస్తున్న ప్రాంతాలను 'హాట్‌స్పాట్ మ్యాప్' ద్వారా గుర్తించి అదనపు బలగాలను మోహరించవచ్చు.ఎస్పీ వాయిస్ సందేశం నేరుగా అన్ని వాహనాలకు కంట్రోల్ రూమ్ నుంచి ఎస్పీ రికార్డ్ చేసిన వాయిస్ సందేశం ఒకేసారి అన్ని రూట్ మొబైల్ ఫోన్లకు చేరుతుంది. ఫోన్‌లో ముందుగా అలర్ట్ బీప్ మోగి, ఆ తర్వాత సందేశం ఆటోమేటిక్‌గా వినిపిస్తుంది. అలాగే రూట్ మొబైల్స్ ప్రతి గంటకు పోలింగ్ ప్రదేశాల వారీగా పోలైన ఓట్ల వివరాలను పంపుతాయి. దీంతో ప్రదేశాల వారీగా పోలింగ్ శాతం కంట్రోల్ రూమ్‌లో తెలుస్తుంది.

సాంకేతికతతో పటిష్టమైన భద్రత... పారదర్శకమైన పర్యవేక్షణ

ప్రతి రూట్‌కు నమోదైన అధికారి మొబైల్‌లో మాత్రమే యాప్ పనిచేసేలా భద్రతా ఏర్పాట్లు చేశారు. జిల్లా ఉన్నతాధికారులు తమ ఫోన్‌లోని 'ట్రేస్ మానిటర్' యాప్ ద్వారా ఎక్కడ ఉన్నా బందోబస్తును పర్యవేక్షించవచ్చు. ప్రతి పోలింగ్ ప్రదేశం, ప్రతి పోలీసు వాహనం ఒకే వ్యవస్థ పరిధిలోకి రావడం వల్ల సమన్వయం మరింత బలోపేతం అవుతుంది. సమస్య ఎక్కడ తలెత్తినా వెంటనే సమాచారం అందడం, సమీప బలగాలు తక్షణం స్పందించడం ద్వారా అవాంఛనీయ ఘటనలకు అడ్డుకట్ట వేయడానికి ఈ యాప్ ఎంతగానో దోహదపడుతుంది. జిల్లాలో ప్రశాంతమైన, పారదర్శకమైన ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పోలీసుశాఖను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుతున్నారు.ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో కాకినాడ జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ ఎం. కిషోర్ కుమార్,అడిషనల్ ఎస్పీ (ఏ ఆర్) ఎస్ శ్రీనివాసరావు, ఎస్బి డిఎస్పీ కెవివి సత్యనారాయణ, కాకినాడ డిఎస్పీ ఎన్ ఎస్ వి కే దుర్గారావు, పెద్దాపురం డిఎస్పీ ఎబిజి తిలక్, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్ఓలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

విశ్రాంత జీవితం సుఖమయం కావాలి : జిల్లా ఎస్పీ



కాకినాడ, నిర్భయవార్త ప్రతినిధి :పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పాటు అంకితభావంతో విశిష్ట సేవలందించి స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన ఆర్మ్డ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్ పి. పనస రాముడు, దాదాపు 40 సంవత్సరాల పాటు హోంగార్డుగా సేవలందించిన పి. సీతారామ స్వామిని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ వారి సుదీర్ఘ సేవలను అభినందిస్తూ, పోలీస్ శాఖకు వారు అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం వారి జీవితాలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్,ఎస్బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ఎం. నరసింహ మూర్తి, కె. వెంకటరావు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఏలూరులో పోలీసుల నిర్లక్ష్యం..

ఏలూరు జిల్లా, అక్టోబర్ 31: నిర్భయవార్త ప్రతినిధి :జిల్లాలో పోలీసుల నిర్లక్ష్యం చర్చనీయాంశమైంది. రెండు రోజులుగా రోడ్డు పక్కనే పడి ఉన్న మృతదేహాన్ని గుర్తించక పోవడమేమిటని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే..స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల అక్టోబర్ 29వ తేదీన ఏలూరు జిల్లాలోని ఆగిరిపల్లి మండలంలో ఓ ప్రమాదం చోటుచేసుకుంది. మండలంలోని ఎస్ఏ పేట వద్ద అర్ధరాత్రి.. ప్రమాదవశాత్తు ఓ బీర్ లోడ్ లారీ బోల్తా పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. రోడ్డుపై అడ్డంగా ఉన్న లారీని తొలగించడంలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో లారీ క్యాబిన్‌లో ఇరుక్కొని ఉన్న ఓ వ్యక్తి మృతదేహం కనిపించగా.. పక్కనే ఓ ద్విచక్రవాహనాన్ని గుర్తించారు. కాగా.. మృతదేహాన్ని స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పరిశీలించిన వైద్యులు.. ఆ వ్యక్తి లారీ ప్రమాదం వల్ల మృతి చెందలేదని.. రెండు రోజుల క్రితమే మరణించి ఉంటాడని ధ్రువీకరించారు. దీంతో కంగుతిన్న పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టగా.. మృతుడిని శోభనాపురం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. రెండు రోజుల క్రితం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో మరణించినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో రెండు రోజులుగా రోడ్డు పక్కనే పడి ఉన్న మృతదేహాన్ని గుర్తించకపోవడం.. పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శనమంటూ తీవ్రమైన విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉత్సాహంగా 'రన్ ఫర్ యూనిటీ'..

దేశ సమైక్యత, సమగ్రతకు ప్రతీక ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ : జిల్లా

కాకినాడ,నిర్భయవార్త ప్రతినిధి : :ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం నిర్వహించే జాతీయ ఏక్తా దివస్ సందర్భంగా కాకినాడ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో 'రన్ ఫర్ యూనిటీ' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది కాకినాడ సర్పవరం పోలీస్ స్టేషన్ నుంచి రిజర్వ్ పోలీస్ లైన్స్ మీదుగా జిల్లా పోలీసు కార్యాలయం వరకు ఐక్యతా పరుగులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు స్థానికులు, మీడియా ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు.అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ సమైక్యతకు చేసిన సేవలు చిరస్మరణీయం. స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని వందలాది సంస్థానాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి అఖండ భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడు పటేల్ గారు. ఆయన దృఢ సంకల్పం, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. విభిన్న భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు కలిగిన భారతీయులందరినీ ఐక్యంగా ఉంచడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని అన్నారు.దేశ సమగ్రత, సమైక్యతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధి, శాంతి భద్రతలు, ప్రజల మధ్య సోదరభావం కొనసాగాలంటే ఐక్యత ఎంతో అవసరమని పేర్కొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, భావితరాలకు దేశభక్తి, ఐక్యతా స్ఫూర్తిని అందించాలని తెలిపారు. ఆయన జయంతి సందర్భంగా నిర్వహించే ఏక్తా దివస్ కార్యక్రమాలు దేశ సమైక్యత పట్ల మనందరిలో మరింత నిబద్ధతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఎస్పీ అందరితో ఏక్తా దివస్ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం జిల్లా ఎస్పీ, ఇతర పోలీసు అధికారులు సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, అడిషనల్ ఎస్పీ ఏఆర్ ఎన్. శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ వి.జి. శ్రీహరి రావు, ఆర్ఐలు, సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





ఆదిత్య డిగ్రీ కళాశాలలో జాతీయ సమైక్యతా దినోత్సవం.

కాకినాడ, నిర్భయవార్త ప్రతినిధి :ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జాతీయ సమైక్యత దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు.స్వాతంత్ర సమరయోధునిగానే కాకుండా స్వాతంత్రానంతరం నంస్థానాలు విలీనం కావడానికి గట్టి ప్రయత్నం చేసి సఫలుడైన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్. అక్టోబర్ 31వ తేదీ ఉక్కుమనిషి 151వ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యత దినోత్సవం ఆదిత్య డిగ్రీ కళాశాలలో జరిగింది. సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి డాక్టర్ నాయుడు, శ్రీ సత్య సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల వ్యవస్థాపకులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ అడ్డాల మాట్లాడుతూ మాట్లాడుతూ "భారతదేశ తొలి ఉప ప్రధాని, తొలి హోం మంత్రి 'సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్' జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 31న జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని (రాష్ట్రీయ ఏకతా దివస్) జరుపుకుంటామని ,భారతదేశపు ఆధునిక ఆల్ ఇండియా సర్వీసెస్ వ్యవస్థను రూపొందించినందున ఆయనను "ఫాదర్ ఆఫ్ ఇండియన్ సివిల్ సర్వీసెస్" అని కూడా పిలుస్తారని ,జాతిని ఏకతాటిపై నిలిపి, ఐక్యతకు చిరునామాగా నిలచిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు. అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ "లక్ష్య సాధనకు విద్యార్థులు ఉక్కు మనిషిని ఆదర్శంగా తీసుకొని ఉక్కు సంకల్పంతో లక్ష్యాలు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు " సంస్థానాల విలీకరణలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర" అనే అంశంపై వక్తృత్వ పోటీ నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో విజేతలకు డాక్టర్ అడ్డాల చేతులమీదుగా ప్రశంసాపత్రం మరియు జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు తేజేశ్వరరావు, డి అశ్విని మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



దెయ్యాలంటేనే భయపడే రోజులు పోయాయా..

హారర్ జానర్‌కు కొత్త కష్టాలు! హారర్ సినిమాలు ప్రేక్షకులను భయపెట్టడంలో విఫలమవుతున్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.



ఒకప్పుడు తెలుగు సినిమా పరిశ్రమలో హారర్ సినిమాలకు మంచి ఆదరణ ఉండేది. ముఖ్యంగా చిన్న సినిమాలు కూడా భయపెట్టే కథలతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలు సాధించేవి. ప్రేక్షకులు థియేటర్లలో భయపడుతూ, ఆసక్తిగా సినిమాలు చూసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. హారర్ సినిమాలు ప్రేక్షకులను భయపెట్టడంలో విఫలమవుతున్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మారుతి దర్శకత్వంలో వచ్చిన 'ప్రేమకథా చిత్రం' తెలుగు హారర్ కామెడీ సినిమాలకు కొత్త ఊపునిచ్చింది. ఈ సినిమా భారీ విజయం సాధించడంతో చాలామంది దర్శకులు హారర్ కామెడీ కథలతో సినిమాలు తెరకెక్కించడం మొదలుపెట్టారు. దెయ్యాలు, భయపెట్టే శబ్దాలు, కామెడీ సన్నివేశాలతో ఎన్నో సినిమాలు వచ్చాయి. కొంతకాలం ఈ ఫార్ములా బాగానే పనిచేసింది. ఇంటర్వెల్, క్లైమాక్స్ లను ముందుగా రాసుకొని తర్వాత కథలను రాస్తే కలిగే ఇబ్బందులు ఇవేనా? కానీ ఇప్పుడు ప్రేక్షకులు ఇలాంటి సినిమాలకు అలవాటు పడిపోయారు. దెయ్యం కనిపించగానే పెద్ద శబ్దాలు చేయడం, అకస్మాత్తుగా భయపెట్టే సన్నివేశాలు చూపించడం వంటి పాత పద్ధతులు ప్రేక్షకులకు కొత్తగా అనిపించడం లేదు. దీంతో భయం కలగాల్సిన చోట నవ్వు వస్తోందనే విమర్శలు కూడా వస్తున్నాయి. మరోవైపు హారర్ సినిమాల్లో కామెడీ ఎక్కువ కావడం కూడా సమస్యగా మారింది. భయపెట్టే సన్నివేశం మధ్యలో అనవసరమైన కామెడీ రావడంతో ప్రేక్షకులు కథలో లీనమవ్వలేకపోతున్నారు. హారర్ సినిమాలకు బలమైన కథ, ఉత్కంఠ వాతావరణం చాలా అవసరం. ూశ్రీంశీ =ఘఽ – 'వృషకర్మ'.. అసలు గేమ్ స్టార్ట్ చేసిన జోడీ ూఽజవతీఅంవఎవత్ పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కిన ది రాజా సాబ్ వంటి సినిమాల విషయంలో కూడా హారర్ అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయాయి. అయితే హారర్ జానర్‌కు ప్రేక్షకులు పూర్తిగా దూరమయ్యారని చెప్పలేం. 'మసూద', 'విరూపాక్ష' వంటి సినిమాలు మంచి కథ, మిస్టరీ, భయపెట్టే వాతావరణం ఉంటే ప్రేక్షకులు ఆదరిస్తారని నిరూపించాయి. ప్రస్తుతం ప్రేక్షకులు హాలీవుడ్ హారర్ సినిమాలు, కొత్త తరహా థ్రిల్లర్లను కూడా చూస్తున్నారు. అందుకే తెలుగు దర్శకులు పాత ఫార్ములాలను పక్కనపెట్టి కొత్త కథలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. నిజంగా భయపెట్టే కథలు, బలమైన స్క్రీన్‌ప్లే, అద్భుతమైన సాంకేతిక విలువలు ఉంటే హారర్ సినిమాలకు మళ్లీ మంచి రోజులు వచ్చే అవకాశం ఉంది. ఒకప్పుడు హిట్ జానర్‌గా నిలిచిన హారర్ సినిమాలు మళ్లీ ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తాయా అనేది చూడాలి.

44 వయసు అంటే నమ్మేదెలా శ్రీయా?

తాజాగా శ్రియా శరణ్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన కొత్త ఫోటోషూట్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. భారతీయ చలనచిత్ర పరిశ్రమలో చాలామంది కథానాయికలు విదేశీ మోడల్స్ లేదా విదేశీ క్రీడాకారులను పెళ్లాడి వ్యక్తిగత జీవితంలో స్థిరపడిన సందర్భాలు ఉన్నాయి. అయితే అందులో కొన్ని బంధాలు ఆశించిన స్థాయిలో కొనసాగక ముగిసిపోవడం చూశాం. కానీ దానికి భిన్నంగా సీనియర్ కథానాయిక శ్రియా శరణ్ ఒక విదేశీ క్రీడాకారుడిని వివాహం చేసుకుని ఎంతో సంతోషకరమైన కుటుంబ జీవితాన్ని గడుపుతున్నారు. పెళ్లయి ఒక పాపకు తల్లి అయినా వ్యక్తిగత బాధ్యతలను నెరవేరుస్తూనే తన గ్లామర్ అండ్ యాక్టింగ్ కెరీర్‌ను అద్భుతంగా బ్యాలెన్స్ చేయడం అందరినీ ఆకట్టుకుంటోంది. తాజాగా శ్రియా శరణ్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన కొత్త ఫోటోషూట్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోషూట్‌లో శ్రియ తన బిగి అందాలను ప్రదర్శిస్తూ అభిమానుల్లో హుషారు పెంచారు. ప్రత్యేకమైన డిజైనర్ శారీకి తగ్గట్టుగానే క్రిస్టల్స్.. గోల్డెన్ జరీ లుక్‌తో మెరిసిపోతున్న ఆ బ్లౌజ్ నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. పెళ్లై పిల్లలు ఉన్నా శ్రియలో చెక్కుచెదరని రూపాన్ని, ఫిట్‌నెస్‌ను చూసి నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. అంతేకాదు శ్రీయ అందానికి ఫిదా అయిపోయిన అభిమానులు అప్పుడే 44 వయసు అంటే నమ్మేదెలా? అంటూ కాంప్లిమెంట్లు ఇస్తున్నారు. దాదాపు పాతికేళ్ల క్రితం ఇష్టం సినిమాతో తెలుగు తెరపై అడుగుపెట్టిన శ్రీయ ఇప్పటికీ తన అందాన్ని అంతే క్లాసీగా మెయింటెయిన్ చేయడం ఆశ్చర్యపరుస్తోందని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ప్రత్యేకమైన ఈవెంట్ లుక్ వెనుక పెద్ద ఫ్యాషన్ టీమ్ శ్రమ ఉందనే చెప్పాలి. ఐటిఆర్ హెచ్ రిధి బన్సాల్ బ్రాండ్‌కు చెందిన దుస్తులను ప్రముఖ స్టైలిస్ట్ మోహిత్ రాయ్, నన్నికా భూప్తాని ఎంతో ఆకర్షణీయంగా స్టైలింగ్ చేశారు. దీనికి జకార్తీ జ్యువెలరీ అందించిన ఆభరణాలు మరింత శోభను తెచ్చాయి. ఈ అద్భుతమైన ఫోటోలను పోస్ట్ చేస్తూ తనకు సహకరించిన స్టైలింగ్ అండ్ మేకప్ టీమ్‌కు శ్రియ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. కేవలం గ్లామరస్ ఫోటోషూట్‌లకే పరిమితం కాకుండా. పెళ్లి తర్వాత కూడా శ్రియ వరుస సినిమాలతో రీ-ఎంట్రీ ఇచ్చి బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటుతున్నారు. ఇటీవల తేజ సజ్జా కథానాయకుడిగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో వచ్చిన సోషియో-ఫాంటసీ మూవీ -మిరాయ్-లో శ్రియ అంబికా ప్రజాపతిగా కీలక పాత్రలో కనిపించి మెప్పించారు. భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో వచ్చిన ఈ పాన్-ఇండియా చిత్రం థియేటర్లలో ఘనవిజయం సాధించింది. అలాగే బాలీవుడ్‌లో అజయ్ దేవగణ్ సరసన నందిని సల్గాఓంకర్ గా నటించిన హిట్ ఫ్రాంచైజ్ -దృశ్యం 3- ఇటీవలే విడుదలై బాక్సాఫీస్ వద్ద బంపర్ హిట్ కొట్టింది. తమిళంలో కార్తీక్ సుబ్బరాజ్-సూర్య కాంబినేషన్ మూవీ -రెట్రో-లో లవ్ డిటాక్స్ స్పెషల్ సాంగ్‌తో అలరించిన శ్రియ, కార్తిక్ నరేన్ దర్శకత్వంలో అరవింద్ స్వామితో కలసి -నరగాసూరన్- అనే చిత్రంలోనూ నటించారు. వీటితో పాటు డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో కరణ్ జోహార్ నిర్మించిన -షోటైమ్- వెబ్ సిరీస్ ద్వారా డిజిటల్ స్పేస్‌లోకి అడుగుపెట్టి ఓటీటీలోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

'వృషకర్మ'.. అసలు గేమ్ స్టార్ట్ చేసిన జోడీ


చైతూ ఇప్పటివరకు చేసిన సినిమాలతో పోలిస్తే 'వృషకర్మ' కోసం భారీ బడ్జెట్ ఖర్చు చేస్తున్నారు. పైగా ఇది రెగ్యులర్ లవ్ స్టోరీ కాదు. ఒక సినిమా కోసం రెండేళ్లు కష్టపడ్డాక, దాని గురించి ప్రేక్షకులకు చెప్పడానికి నెల రోజులే మిగిలితే మామూలు ప్రమోషన్లు సరిపోవు. బాక్సాఫీస్ వద్ద సినిమా క్లిక్ కావాలి అంటే ప్రమోషన్ గేమ్ లో తప్పకుండా క్లిక్కవ్వల్సిందే. ఇక నాగచైతన్య 'వృషకర్మ' టీమ్ ఇప్పుడు అదే పరిస్థితిలో ఉంది. ఇంతకాలం పోస్టర్లు, చిన్న అప్‌డేట్స్‌కే పరిమితమైన చిత్రబృందం ఒక్కసారిగా బయటకు వచ్చింది. లేటెస్ట్ గా చైతూ, మీనాక్షి చౌదరి కలిసి ప్రమోషన్లకు హాజరయ్యారు. ఇద్దరూ ట్రెడిషనల్ దుస్తుల్లో కెమెరాల ముందు కనిపించారు. కానీ ఈసారి వాళ్లు చేస్తున్న ప్రచారంలో ఓ ప్రత్యేకత కనిపిస్తోంది. సినిమా భారీగా తీశామని చెప్పే బదులు, షూటింగ్ జరిగిన ప్రదేశాన్నే మీడియాకు చూపిస్తున్నారు. ఇటీవల విలేకరులను 'వృషకర్మ' సెట్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ యాభై రోజులు కష్టపడి నిర్మించిన బ్రహ్మగిరి గుహను పరిచయం చేశారు. మూడు భాగాలుగా ఉన్న ఈ సెట్‌లో కీలక సన్నివేశాలు తీశారు. ఇందులో చిత్రీకరణ ఎలా జరిగిందో మీడియాకు వివరించారు. గ్రాఫిక్స్‌తో సరిపెట్టకుండా నిజంగా గుహ నిర్మించడం వెనుక ఎంత పని జరిగిందో చూపించే ప్రయత్నమిది. చైతూ ఇప్పటివరకు చేసిన సినిమాలతో పోలిస్తే 'వృషకర్మ' కోసం భారీ బడ్జెట్ ఖర్చు చేస్తున్నారు. పైగా ఇది రెగ్యులర్ లవ్ స్టోరీ కాదు. పురాణాల నేపథ్యం, రహస్యాలు, సాహసాలతో కూడిన సినిమా. ప్రేక్షకులకు కథ ఏ తరహాలో ఉండబోతోందో అర్థమయ్యేలా చేయడానికి ఒక్క పోస్టర్ సరిపోదు. అందుకే విడుదలకు ముందే ఈ భారీ మేకింగ్‌ను చూపించడం మొదలుపెట్టారు. 'తండేల్'లో మత్స్యకారుడిగా కనిపించిన చైతూ, ఇప్పుడు పూర్తిగా భిన్నమైన పాత్రలోకి వెళ్లారు. మరోవైపు 'విరూపాక్ష'తో మంచి విజయం అందుకున్న కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్నారు. ఆయనకు 'విరూపాక్ష' తర్వాత ఇది రెండో సినిమా. గత సినిమాలో భయాన్ని, రహస్యాన్ని బాగా ఉపయోగించుకున్న దర్శకుడు ఈసారి మరింత పెద్ద కథను ఎంచుకున్నారు. ఇద్దరికీ ఈ సినిమా కెరీర్‌లో కొత్త తరహా ప్రయత్నం కావడంతో ప్రేక్షకుల అంచనాలు కూడా మారాయి. అద్భుతానికి శ్రీకారం చుడుతున్న సుకుమార్ నిర్మాతల వైపు నుంచి కూడా పెద్ద ప్లానింగ్ జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక థియేట్రికల్ హక్కులను దిల్ రాజు సంస్థ తీసుకుంది. సుకుమార్ రైటింగ్స్, శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర కలిసి సినిమాను



నిర్మిస్తున్నాయి. డిజిటల్, శాటిలైట్ హక్కులు కూడా జీ సంస్థ తీసుకుంది. భారీ స్థాయిలో బిజినెస్ జరుగుతున్నప్పుడు ప్రమోషన్లు చివరి వారానికి వదిలేయడం కష్టం. అందుకే నవంబర్ అంతా ప్రచార కార్యక్రమాలు నిర్వహించేందుకు టీమ్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇక కథలో చైతూ, మీనాక్షితో పాటు మరికొన్ని ముఖ్యమైన పాత్రలు హైలెట్ కానున్నాయి. మీనాక్షి పురావస్తు పరిశోధకురాలిగా, జయరామ్ ప్రొఫెసర్ రంగనాథ్‌గా కనిపించనున్నారు. 'లాపతా లేడీస్' ఫేమ్ స్పర్శ్ శ్రీవాస్తవ విలన్‌గా నటిస్తున్నారు. 'విరూపాక్ష'కు పనిచేసిన అజనీష్ లోక్‌నాథ్ మరోసారి కార్తీక్‌తో కలిశాడు. ఇక సినిమాలోని పాత్రలను ఒక్కొక్కటిగా ప్రేక్షకులకు పరిచయం చేసే అవకాశం ఉంది. డిసెంబర్ 4న సినిమా విడుదల కానుండగా, అంతకుముందు వచ్చే ట్రైలర్‌తో ఈ మిస్టరీ కథపై మరింత క్లారిటీ రానుంది.


రామ్ చరణ్ సినిమాలో అచ్చ తెలుగు అమ్మాయి..

అద్భుతానికి శ్రీకారం చుడుతున్న సుకుమార్ ఈ సినిమాలో హీరోయిన్‌గా అచ్చ తెలుగు అమ్మాయి సాత్విక వీరవల్లి పేరు వినిపించడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. టాలీవుడ్‌లో అచ్చ తెలుగు అమ్మాయిలకు హీరోయిన్‌గా అవకాశాలు రావడం చాలా అరుదుగా కనిపిస్తోంది. ముఖ్యంగా పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కే భారీ సినిమాల్లో తెలుగు అమ్మాయిలను హీరోయిన్‌గా తీసుకోవడం మరింత ప్రత్యేకమైన విషయం అని చెప్పాలి. ఇప్పుడు దర్శకుడు సుకుమార్ అలాంటి ఒక మంచి ప్రయత్నం చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. రామ్ చరణ్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కనున్న =ఙ17 సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. రంగస్థలం వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ ఇద్దరి కలయికలో సినిమా వస్తుండటంతో అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా అచ్చ తెలుగు అమ్మాయి సాత్విక వీరవల్లి పేరు వినిపించడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. సాత్విక వీరవల్లి ఆకాశంలో ఒక తార సినిమాతో హీరోయిన్‌గా పరిచయం కానుంది. ఆమె నటించిన మొదటి సినిమా ఇంకా విడుదల కాకముందే రామ్ చరణ్ వంటి స్టార్ హీరో సినిమాలో అవకాశం రావడం నిజంగా పెద్ద విషయమే. ఈ వార్త నిజమైతే సాత్విక కెరీర్‌కు ఇది గొప్ప మలుపుగా మారే అవకాశం ఉంది. గతంలో తెలుగు సినిమా పరిశ్రమలో సావిత్రి వంటి అచ్చ తెలుగు నటీమణులు స్టార్ హీరోయిన్లుగా ఎదిగారు. తమ నటనతో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఆ తర్వాత కాలంలో తెలుగు సినిమాల్లో ఇతర భాషల హీరోయిన్లకు ఎక్కువ అవకాశాలు వచ్చాయి. రష్మిక మందన్న, సమంత, నయనతార వంటి హీరోయిన్లు స్టార్ ఇమేజ్ సంపాదించుకున్నారు. ఇప్పుడు మళ్లీ తెలుగు అమ్మాయిలకు పెద్ద సినిమాల్లో అవకాశాలు రావడం మంచి పరిణామమనే చెప్పాలి. ముఖ్యంగా సుకుమార్ లాంటి స్టార్ దర్శకుడు కొత్త అమ్మాయిని ఎంపిక చేయడం పరిశ్రమలో కొత్త మార్పుకు నాంది కావచ్చు. =ఙ17 హీరోయిన్‌గా సాత్విక పేరు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. నవంబర్ 1న జరగనున్న సినిమా పూజా కార్యక్రమంలో దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. డిసెంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవేళ ఈ వార్త నిజమైతే సాత్వికకు ఇది భారీ అవకాశం. అచ్చ తెలుగు అమ్మాయిని పాన్ ఇండియా సినిమాలో హీరోయిన్‌గా పరిచయం చేయడం ద్వారా సుకుమార్ కొత్త ప్రతిభకు పెద్ద వేదిక కల్పించినట్లే అవుతుంది. మరి ఈ సినిమా ఎలాంటి సక్సెస్ సాధిస్తుందో వేచి చూడాలి.



దుల్కర్ రీసెంట్ ప్లాప్ 'ఐమ్ గేమ్' కి ఓటిటి డేట్ వచ్చేసింది.. ఎప్పుడు ఎందులో అంటే!

మలయాళ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో దుల్కర్ సల్మాన్ ప్రస్తుతం తెలుగు సహా ఇట భాషల్లో కూడా పలు సినిమాలు చేస్తూ బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. అయితే రీసెంట్ గా దుల్కర్ నుంచి వచ్చిన ప్లాప్ సినిమానే 'ఐమ్ గేమ్'. దర్శకుడు నహస్ హిదయత్ తెరకెక్కించిన ఈ ఇంట్రెస్టింగ్ ఫాంటసీ సినిమా గ్యాంబ్లింగ్ నేపథ్యంలో వచ్చి ప్లాప్ గానే మిగిలిపోయింది.పాన్ ఇండియా లెవెల్లో ప్లాన్ చేసిన ఈ చిత్రం ఇప్పుడు ఫైనల్ గా ఓటిటి ఎంట్రీకి సిద్ధం అయ్యింది. ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులు జియో హాట్ స్టార్ వారు సొంతం చేసుకోగా అందులో ఈ సినిమా రానున్న నవంబర్ 6 నుంచి స్ట్రీమింగ్ కి అందుబాటులో ఉంటుంది అని కన్ఫర్మ్ చేశారు.ఇక ఇందులో కూడా పాన్ ఇండియా భాషల్లోనే ఈ సినిమా వస్తున్నట్టు కూడా ఖాయం చేశారు. సో అప్పుడు ఎవరైనా ఈ సినిమా మిస్ అయితే ఇప్పుడు చూడొచ్చు. ఈ సినిమాకి జాక్స్ బిజోయ్ సంగీతం అందించగా కయాదు లోహర్ హీరోయిన్ గా నటించింది. అలాగే దుల్కర్ నిర్మాణం కూడా వహించాడు.



Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197